
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 4 VOLUME : 4 | సంచిక : 16 ISSUE NO : 16 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం, జూలై,14, 2026 Tuesday, July,14, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /- |
|---|---|---|---|---|---|



ఇక హర్మూజ్ జలసంధిని మేమే

## నడిపిస్తాం

- హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నామన్న ట్రంప్
- ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ డ్రోన్లు పంపుతోందని ఆరోపణ

ఇంటర్నెట్ న్యూస్,జూలై13

అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలకు దారితీసే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. కీలకమైన హర్మూజ్ జలసంధిని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని, ఇకపై దాని భద్రతను శాశ్వతంగా పర్యవేక్షిస్తుందని సోమవారం స్పష్టం చేశారు.



ఇరాన్‌పై అమెరికా ముప్పేట

## దాడులు

- హర్మూజ్ జలసంధిలో నౌకలపై ఇరాన్ దాడి.. అమెరికా ప్రతీకారం

ఇంటర్నెట్ న్యూస్,జూలై13

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు పాల్పడటంతో అమెరికా భారీ ఎత్తున ప్రతీకార దాడులు ప్రారంభించింది. గత 24 గంటల్లో ఇది మూడోసారి కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ పరిణామాలతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొనగా, అంతర్జాతీయ సమాజంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం

# సహకరించాలి

### అన్ని పార్టీల ఎంపీలు సమష్టిగా కృషి చేయాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం
- తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి
- హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు, రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలి
- హైదరాబాద్‌కు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ను తీసుకురావడంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,జూలై13,తెలంగాణ దిశ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజ కీయ ాలకు అతీతంగా వ్యవహరించాలని, అందుకు అన్ని పార్టీల ఎంపీలు సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో సోమవారం జరిగిన ఆల్ పార్టీ ఎంపీల సమావేశంలో సీఎం రేవం త్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సంద ర్భంగా తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకారం అత్యంత కీలకమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశవిస్తరణకు, రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు. అలాగే హైదరాబాద్‌కు ఇండియన్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ను తీసుకు రావడంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. రీజినల్ రింగ్ రోడ్‌భూసేకరణ దాదాపు పూర్తయింద ని, ఇప్పుడు కేంద్రం నుంచి నిధులు విడుదలైతే ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసే అవకాశంఉంటుందని సీఎం తెలిపారు. మూసీ పునరుజ్జీవన ప్రాజె క్టుకు అవసరమైన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ అనుమతులు మంజూరు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్ని పార్టీల ఎంపీలను సీఎం రేవంత్ కోరారు. ఈ సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల అంశాన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో పలు అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు.

షాబాద్ సామూహిక హత్యల ప్రధాన నిందితుడు

## రాజ్ కుమార్ మృతి



కొత్తూరు మండలం పెంజర్లలో మృతదేహం లభ్యం...

- మృతదేహం పక్కనే పాయిజన్ బాటిల్



హైదరాబాద్, జూలై,13,తెలంగాణ దిశ : రంగారెడ్డి జిల్లాలో తన భార్య, ఇద్దరు పిల్లలతో సహా ఆరుగు రిని అత్యంత కిరాతకంగా హతమార్చి, రెండు రోజులుగా పరారీలో ఉన్న నిందితుడు బి. రాజ్ కుమార్ (29) సోమవారం శవమై కనిపిం చాడు. హైదరా బాద్ శివారులోని కొత్తూరు మండలం, పెంజర్ల వద్ద ఒక రియల్ ఎస్టేట్ వెంచ ర్‌లో అతని మృతదే హాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ గ్రామం అతని మేనమామ స్వ గ్రామంగా తెలుస్తోంది. సం ఘటనా స్థలానికి చేరు కున్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌తరుణ్ జోషి, ఇతర ఉన్న తాధికారులు మృతుడిని రాజ్ కుమార్ గా నిర్ధారించారు.

మృతదేహం సమీపంలో విషం సీసా లభించడంతో అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు ప్రాథమి కంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తరలించి, దర్యా ప్తు చేపట్టారు. జూలై 10వ తేదీ రాత్రి షాబాద్ మండలంలో రాజ్ కుమార్ ఈ దారుణ హత్యలకు పాల్పడ్డాడు. తనపై పోక్సో కేసు పెట్టిన 17 ఏళ్ల బాలిక, ఆమె తల్లి, నాయనమ్మతో పాటు తన భార్య సరిత, ఇద్దరు కుమారులను కత్తితో పొడిచి, గొంతు కోసి చంపాడు. ఈ హత్యలు చేసిన తర్వాత తన తండ్రికి ఫోన్ చేసి, విషయం చెప్పి తాను కూడా చనిపోతున్నట్లు తెలిపాడు. పోక్సో కేసు పెట్టిన కక్షతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.


ఈ కేసులో గత నెలలోనే అతనికి యాంటిసిపేటరీ బెయిల్ లభించింది. హత్యల తర్వాత రాజ్ కుమార్ కోసం పోలీసులు భారీ గాలింపు చేపట్టి, అతని ఆచూకీ తెలిపిన వారికి రూ. 2 లక్షల రివార్డు కూడా ప్రకటించారు. కాగా, నిందితుడి నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహించారని బాధితుల కుటుంబం ఆరోపించడంతో పోక్సో కేసు దర్యాప్తు అధికారి అయిన షాబాద్ ఎస్సై టి. రమేశ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు..

## ఏఐ వాడకంలో భారత్ నెం.1

### ఏఐ వాడకంలో భారత ఉద్యోగులు ప్రపంచంలోనే అగ్రస్థానం

న్యూఢిల్లీ,జూలై13

కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో భారత ఉద్యోగులు ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచారని ఏడీపీ అనే సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలోని 80 శాతం మంది ఉద్యోగులు వారంలో చాలాసార్లు ఏఐని వాడుతుండగా, 41 శాతం మంది ప్రతిరోజూ వినియోగిస్తున్నారని సోమవారం విడుదలైన ఈ రిపోర్ట్ పేర్కొంది.రాబోయే ఏడాదిలో ఏఐ తమ ఉద్యోగ బాధ్యతలపై సానుకూల ప్రభావం చూపుతుందని 31 శాతం మంది ఉద్యోగులు బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు.



## వియత్నాం బోటు ప్రమాదం

### 15 మంది భారతీయుల మృతదేహాలు ముంబైకి తరలింపు

న్యూఢిల్లీ,జూలై13,

వియత్నాంలోని ఫుక్వోక్ ద్వీపం సమీపంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మరణించిన 15 మంది భారతీయుల మృతదేహాలను స్వదేశానికి తరలిస్తున్నారు. హో చి మిన్ సిటీ నుంచి వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానంలో వారి మృతదేహాలు సోమవారం సాయంత్రానికి ముంబై చేరుకుంటాయని హనోయిలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది.ముంబైకి చేరుకున్న తర్వాత మృతదేహాలను వారి వారి స్వస్థలాలకు పంపేందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.



పోలవరం, బనకచర్లపై పిటిషన్.. తెలంగాణకు

## సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ పిటిషన్
- పోలవరం, కృష్ణా జలాల వినియోగం, బనకచర్ల అంశాలపై దాఖలైన వ్యాజ్యం
- ఏపీ చేపడుతున్న పనులపై స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోరిన తెలంగాణ
- పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలున్నాయన్న ధర్మాసనం
- వాటిని సరిదిద్దకముందే ఏపీకి నోటీసులు జారీ చేయడం కుదరదని స్పష్టీకరణ



హైదరాబాద్,జూలై13,తెలంగాణ దిశ : అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పోలవరం ప్రాజెక్టు, కృష్ణా నదీ జలాల వినియోగం, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ అంశాలపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ కేసులో మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తక్షణమే స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోర్టును తెలంగాణ తరపు న్యాయవాది కోరారు. అయితే, తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని ధర్మాసనం గుర్తించింది. వాటిని సరిచేసే వరకు విచారణ చేపట్టలేమని స్పష్టం చేసింది. ప్రాథమిక లోపాలు సరిదిద్దకముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం గానీ, మధ్యంతర ఉత్తర్వులు (ఇంజంక్షన్/స్టే) ఇవ్వడం గానీ సాధ్యం కా దని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. . ముందుగా పిటిషన్‌లోని లోపాలను సవరిం చాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచి ంచింది. ఆ తర్వాతే మిగిలిన అంశాలపై విచారణ చేపడతామని పేర్కొంది. అన ంతరం కేసు విచారణను వాయిదా వేసింది.

'సింగరేణి భరోసా యాత్ర' ప్రారంభించిన

# తెలంగాణ బీజేపీ

### తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

- హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రారంభం
- కిషన్ రెడ్డి, రాంచందర్ రావు సహా పలువురు నేతలతో 2 రోజుల యాత్రకు శ్రీకారం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపణ
- మోదీ ప్రత్యేకంగా ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని వెల్లడి



హైదరాబాద్,జూలై13,తెలంగాణ దిశ : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకె ళ్లేందుకు తెలంగాణ బీజేపీ సోమవారం 'సింగరేణి భరోసా యాత్ర'ను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తదితర నేతలు ఈ రెండు రోజుల యాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఖమ్మం జిల్లాకు చేరుకున్న వారికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి.

ఈ యాత్రలో భాగంగా నాలుగు జిల్లాల్లోని సింగరేణి గనుల కార్మికులను కలిసి, సంస్థ అభివ ృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివ రించనున్నట్లు బీజేపీ నేతలు తెలిపారు. తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు వల్ల సింగరేణి దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి బలం చేకూరుతుందని, దీంతో కార్మికుల్లో విశ్వాసం పెరిగిందని రాంచందర్ రావు పేర్కొన్నారు. యాత్ర ప్రారం భానికి ముందు మాట్లాడిన రాంచందర్ రావు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు.

## కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షులు
# ముప్పా రామారావుకు ఘనంగా సన్మానం




**దమ్మాయిగూడ,జూలై 13, (తెలంగాణ దిశ)** :కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షులు ముప్పా రామారావును సోమవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముప్పా రామారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. తనకు సహాయ సహకారాలు అందిస్తున్న డివిజన్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురకంటి శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు సంజీవరెడ్డి, ప్రసాద్ గౌడ్, జె. కృష్ణారావు, మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు సునీత, మహిళా కాంగ్రెస్ దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షురాలు జూపల్లి శోభారాణి, ప్రధాన కార్యదర్శి మునీశ్వరి, ఉపాధ్యక్షురాలు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 91 శాతం మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ..

- జిల్లాలో ఘనంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ప్రారంభం





**నాగారం, జూలై 13, (తెలంగాణ దిశ)** : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. ఆనంద్ సోమవారం నాగారం జెడ్పీహెచ్ఎస్ లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ, జిల్లాలో 1నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యువతకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, అలాగే సమాజ స్థాయిలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల్లో పోషకాహార లోపం తగ్గి, ఆరోగ్యవంతమైన ఎదుగుదలతో పాటు చదువులో ఏకాగ్రత కూడా పెరుగుతుందని చెప్పారు. 1-2 సంవత్సరాల పిల్లలకు అర మాత్రను పొడి చేసి నీటితో ఇవ్వాలని, 2-3 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్రను పొడి చేసి నీటితో ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏదైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లల కోసం జూలై 20న మాప్-అప్ డే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్యంగా ఉన్న చిన్నారుల్లో 91 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు జిల్లా వైద్యాధికారి తెలిపారు. మిగిలిన అర్హులైన పిల్లలకు మాప్-అప్ డే సందర్భంగా తప్పకుండా మాత్రలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీదేవి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత, వైద్యాధికారి డాక్టర్ మనుజ, సూపర్ వై జర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డికి ఘనంగా సన్మానం





**దమ్మాయిగూడ, జూలై 13, (తెలంగాణ దిశ)** :కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా దమ్మాయిగూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సురకంటి శ్రీకాంత్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దమ్మాయిగూడకు చెందిన పలువురు ఆయనను ఘనంగాసన్మానించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ అధ్యక్షులుగా ఆయన పని చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ పట్టణ అధ్యక్షులు ముప్పా రామారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు సునీత, మహిళా కాంగ్రెస్ దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షురాలు జూపల్లి శోభారాణి, ప్రధాన కార్యదర్శి మునీశ్వరి, ఉపాధ్యక్షురాలు బాలమణి తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు

# ఎక్సలెన్స్ అవార్డుతో కోలా రవీందర్ ముదిరాజ్‌కు ఘన సన్మానం

- సామాజిక సేవకు లభించిన గుర్తింపు ఇది : డాక్టర్ వేణుగోపాలచారి




**కుత్బుల్లాపూర్, జూలై 13, (తెలంగాణ దిశ)** :సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణలో విశిష్ట సేవలందిస్తున్న సామాజిక పర్యావరణవేత్త కోలా రవీందర్ ముదిరాజ్ కు 'ఎక్సలెన్స్ అవార్డు--2026' ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. సృజనా ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లోని బాబు జగ్జీవన్ రామ్ ఆడిటోరియంలో నిర్వహించిన 'సకల కళా సమ్మేళనం' కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి మాట్లాడుతూ సమాజాభివృద్ధి కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి సన్మానించడం అభినందనీయమని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, ప్రతి ప్లాటులో ఇంకుడు గుంతల ఏర్పాటు, ఇంజెక్షన్ బోర్ల నిర్మాణం, ప్లాస్టిక్ వినియోగ నిర్మూలన, చిన్నారుల్లో ఈతపై అవగాహన కల్పించడం వంటి అంశాల్లో కోలా రవీందర్ ముదిరాజ్ చేస్తున్న సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఆయన చేపడుతున్న కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. నేటి పరిస్థితుల్లో చిన్నారులు సెల్‌ఫోన్లకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, తల్లిదండ్రులు పిల్లలను కళలు, నృత్యాలు, సృజనాత్మక కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఇటువంటి కళా సమ్మేళనాలు చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురికి ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేయగా, ఆర్ఆర్. పిల్లేను ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేయగా, ఆడిటోరియం చప్పట్లతో మారుమోగింది. అవార్డు అందుకున్న కోలా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రజా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర కుమార్ పూనా (ఆర్టిస్ట్), డాక్టర్ సముద్రాల శ్రీదేవి, డా. భాగ్యలక్ష్మి రెడ్డి, వీరభోగ వసంతరాయులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా
# ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ





**కుత్బుల్లాపూర్, జూలై 13, (తెలంగాణ దిశ)** : తెలంగాణ ప్రభుత్వం, జాతీయ ఆరోగ్య మిషన్ సంయుక్తధ్వర్యంలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. గాజులరామారం-2 సబ్ సెంటర్ డాక్టర్ కొమ్ము సౌందర్య ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, నవోదయ పాఠశాలఅగన్‌వాడీ కేంద్రం, చంద్రగిరి నగర్ లో శ్రీ బాలాజీ స్కూల్, ఎన్ఎంఆర్ పాఠశాల, హైదరాబాద్ పాఠశాల, జననీ మోడల్ ఉన్నత పాఠశాల, మక్దుంనగర్ నాగార్జున ఉన్నత పాఠశాల, శ్రీ సాయి విద్యానికేతన్ లలో మాత్రలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా జూలై 20న మాప్- అప్ డే నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన పిల్లలకు జూలై 20న మాప్-అప్ డే సందర్భంగా మాత్రలు అందజేస్తామని ఆమె తెలిపారు. 1-2 సంవత్సరాల పిల్లలకు అర మాత్ర (నూరి), 2--19 సంవత్సరాల పిల్లలకు ఒక పూర్తి మాత్ర ఇవ్వాలని ఆమె సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడి కేంద్రాలతో పాటు ఆరోగ్య సంస్థల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, కడుపు నొప్పి, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రల వినియోగం ద్వారా పిల్లల్లో నులిపురుగులను నివారించి, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదం చేయవచ్చునని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం టి. అమృతమ్మ, ఆశా వర్కర్లు ధనలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై నిర్లక్ష్యం వద్దు: మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనిరెడ్డి

- ఏఎస్ రావునగర్ డివిజన్‌లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'పై అవగాహన




**ఏఎస్ రావునగర్, జూలై 13, (తెలంగాణ దిశ)** :ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనిరెడ్డి పిలుపు నిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని ఏఎస్ రావు నగర్ డివిజన్ వివిధ ప్రాంతాల్లో సోమవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తగా ఓటు హక్కు సాధించిన యువత, ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు, అలాగే ఓటరు కార్డులో తప్పుల సవరణలు చేసుకోవాలనుకునే వారికి ఈ ప్రత్యేక కార్యక్రమం ఒక మంచి అవకాశమన్నారు. ప్రజల్లో చైతన్యం కల్పిస్తూనే, వారు స్వయంగా ఓటరు ఫారమ్ నింపి నమోదు ప్రక్రియను పూర్తి చేసారు. ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని, ఏవైనా లోపాలుంటే సకాలంలో సరిదిద్దుకోవాలని సూచించారు.

# ఎన్యూమరేషన్ ఫారాల పూర్తి ప్రక్రియకు ప్రజల సహకారం అవసరం

- టీటీడీపీ రాష్ట్ర కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు



**కాప్రా,జూలై 13, (తెలంగాణ దిశ)** : ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల పూర్తి ప్రక్రియ కార్యక్రమాన్ని సోమవారం శ్రీనగర్ కాలనీ అసోసియేషన్ కమిటీ హాల్‌తో పాటు సౌత్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి సంబంధిత బిఎల్‌వోలు శ్యామ్ కుమార్, అరవింద్, మహేష్, ఉమలకు అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీపీ రాష్ట్ర కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు మాట్లాడుతూ ఓటరు జాబితా సక్రమంగా ఉండేందుకు ప్రతి అర్హుడైన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సమర్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ అధ్యక్షుడు బాల నరసింహ, సంబంధిత పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఏలు గూడూరు ఆది నారాయణ, గిరి, ఇతర పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి..

## ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణలో బాధ్యతగా వ్యవహరించాలి: కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 13, (తెలంగాణ దిశ):** ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బీఎల్ఓలకు సూచించారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుభాష్‌నగర్ వార్డు కార్యాలయంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్ఓలు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీతో పాటు పూరించిన ఫారాల స్వీకరణలో పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేస్తూ, వారికి అవసరమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు స్వీకరించిన ఫారాలను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని బీఎల్ఓలకు సూచించారు. అందుబాటులో లేని ఓటర్ల వివరాలను వెంటనే సూపర్‌వైజర్లకు తెలియజేయాలని, రోజువారీ లక్ష్యాలను తప్పకుండా పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచనలు ఇచ్చారు. అనంతరం కోంపల్లిలో కొనసాగుతున్న ఎన్యుమరేషన్, డిజిటలైజేషన్ ప్రక్రియలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అక్కడ ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేస్తూ, ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా పూరించే విధానంపై అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



# సంపాదకీయం

## ఒకే ఒక్క శాతం మంది దగ్గర 40 శాతం సంపద

దేశఆదాయంలో 58%.. ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది.భారత్‌లోని 40శాతం సంపద అంతా ఒకే ఒక్క శాతంమంది సంపన్నుల వద్ద ఉంది.భారత్‌లో ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు. స్థూల జాతీయాదాయం పెరుగుతున్నప్పటికీ చాలా దేశాల్లో ఆర్థిక అసమానతలు మాత్రం ఆశించిన స్థాయిలో తగ్గడం లేదని తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. 2023నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం జనాభా.. ఆదాయ అసమానతలు పెరిగిన దేశాల్లోనే ఉందని పేర్కొంది. 1990తో పోలిస్తే మాత్రం అంతర్జాతీయ జనాభాలో 94శాతం మంది స్థూల జాతీయాదాయం పెరిగిందని తెలిపింది. దేశాల్లో, దేశాల మధ్య అసమానతలను తగ్గించడం ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) పదోది. దాన్ని సాధించడంలో ప్రపంచ పురోగతిని గుర్తించేందుకు ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయం సహా పలుఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాల్లో ఉమ్మడిగా తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. సంబంధిత వివరాలు 'నేచర్ సస్టెయినబిలిటీ' అనేజర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అందులోని వివరాల ప్రకారం..2023 నాటికి ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది.. అసమానతలు తగ్గిన దేశాల్లో నివసిస్తున్నారు. – నాలుగింట ఒక వంతు మంది.. 1990తో పోలిస్తే ఆదాయం, అసమానతలు రెండూ గణనీయంగా పెరిగిన ప్రాంతాల్లో ఉన్నారు. ఉత్తర భారత దేశంలో అసమానతలు స్థిరంగా ఉన్నాయి. దక్షిణ భారత రాష్ట్రాల్లో మాత్రం సమ్మిళిత పురోగతి కనిపించింది. ప్రజారోగ్యం, విద్య, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులు పెరగడం, ఆర్థికాభివృద్ధి అందుకు దోహదపడ్డాయి. బ్రెజిల్‌లో పేద కుటుంబాలకు నగదు బదిలీ పథకాలు అసమానతలను తగ్గించేందుకు ఉపకరిస్తున్నాయి పేదలు మరింత పేదరికంలో కూరుకుపోతున్నారు" అన్న వాదన ఎన్నో ఏళ్లుగా ఉంది. ప్రస్తుతం జపాన్‌ను సైతం అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగినప్పటికీ మన దేశంలో ఆర్థిక అసమానతలు ఏ మాత్రం తగ్గడం లేదు.ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత ఆర్థిక అసమానత భారత్‌లో ఉందని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026లో పేర్కొన్నారు. ఆ రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని 40 శాతం సంపద ఒకే ఒక్క శాతం మంది వద్ద ఉంది.వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026 అంచనాలను విశ్లేషకులు లుకాస్ చాన్సెల్, రికార్డో గోమెస్ కరెరా, రోవైదా మోష్రిఫ్, థామస్ పికెట్టి ఎడిట్ చేసి, ప్రచురించారు.ఇటీవలి కాలంలో అసమానతలు తగ్గే సూచనలు కనపడకుండాపోయాయని ఆ రిపోర్టు తెలిపింది. భారత్‌లోని అత్యంత సంపన్న 10% వర్గం సుమారు 65% సంపదను పొందుతోందని నివేదిక తెలిపింది.ఆదాయ అసమానలతు కూడా మామూలుగా లేవు. దేశ ఆదాయంలో 58% ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది. కిందిస్థాయిలో ఉన్న50% వర్గం వారికి దేశ ఆదాయంలో కేవలం 15% మాత్రమే దక్కుతోంది.2014 నుంచి 2024 వరకు దేశంలోని సంపన్న టాప్10% వర్గం, బాటమ్‌లోని 50% వర్గం మధ్య ఆదాయం వ్యత్యాసం స్థిరంగా ఉందని నివేదిక తెలిపింది. అంటే పదేళ్ల క్రితం దేశంలో అసమానతలు ఎలా ఉండేవో ఇప్పుడూ అలానే ఉన్నాయి.భారతదేశంలో సగటు వార్షిక ఆదాయం పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 6,200 యూరోస్, అంటే దాదాపు రూ.6.49 లక్షలు. సగటు సంపద పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 28000 యూరోస్. మహిళల శ్రమ భాగస్వామ్యం 15.7% మాత్రమే ఉందని, గత దశాబ్దంలో పెరుగుదల లేకపోయిందని నివేదిక తెలిపింది.ఇక మొత్తంగా భారతదేశంలో ఆదాయం, సంపద, లింగ పరమైన అసమానతలు అధికంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక విభేదాలుస్పష్టంగా ఉన్నాయని ఇది సూచించింది.140 కోట్ల జనాభాలో దాదాపు 100 కోట్ల మంది తమ ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు స్థిరమైన ఆదాయంతో స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగే వారు కేవలం 13–14 కోట్ల మంది మాత్రమేనని ఈ అధ్యయనం సూచిస్తోంది. అంటే భారత మార్కెట్‌ను అర్థం చేసుకోవాలంటే కేవలంజనాభా పరంగా కాకుండా,ప్రజల ఆదాయ స్థాయిలను,ఖర్చు విధానాలను విశ్లేషించడం అవసరం. భారత్‌లో ఆర్థిక అసమతుల్యత గణనీయంగా ఉంది. నగరాల్లో ఉన్నత, మధ్య తరగతులకు మంచి ఆదాయ వృద్ధి కనిపిస్తున్నా, గ్రామీణప్రాంతాల్లో ఇంకా తక్కువ ఆదాయ స్థాయిలు కొనసాగుతున్నాయి. ఆదాయ వ్యవస్థ మెరుగుపడకపోతే వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరగదు.దేశంలో చాలా మంది అనిశ్చిత ఉపాధిపై ఆధారపడటంతో, నిర్దిష్ట ఆదాయ స్థాయిని చేరుకోవడం కష్టమవుతోంది. 100 కోట్ల మంది వినియోగదారులు వ్యక్తిగతఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. వీరి ఆదాయం ప్రధానంగా ఆహారం, వైద్యం, విద్య వంటి అవసరాలకే సరిపోతోంది. విలాస వస్తువులు, గృహోపకరణాలు, వినోదం, టూరిజం వంటి విభాగాల్లో వీరు పెద్దగా ఖర్చు చేయడం లేదు. ఈ వాస్తవం మార్కెట్ వ్యూహాలపై గణనీయమైన ప్రభావం చూపుతోంది. మధ్యతరగతి, ఉన్నత వర్గాలే లక్ష్యం. భారతమార్కెట్‌ను అనేక కంపెనీలు మధ్యతరగతి, ఉన్నత వర్గాలను లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి చేశాయి. అయితే,వినియోగ సామర్థ్యం పరంగా చూస్తే, తక్కువ ఆదాయం గల వినియోగదారులు పెద్ద సంఖ్యలో ఉన్నందున, మార్కెట్ వ్యూహాలను పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ప్రీమియం ఉత్పత్తులతో పాటు, బడ్జెట్ –ఫ్రెండ్లీ ప్రోడక్ట్స్, స్థిరమైన ధరల వ్యూహాలు, ఫైనాన్స్– ఆధారిత వినియోగ మోడల్స్ ద్వారా ఈ వర్గాన్ని ఆకర్షించే మార్గాలను పరిశీలించాలి. భారత మార్కెట్ వృద్ధి కొనసాగాలంటే కేవలం ఉన్నత ఆదాయ వర్గాలను లక్ష్యంగా పెట్టుకోవడం సరిపోదు. తక్కువ ఆదాయ గల వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుని, వారికి అందుబాటులో ఉండే ఉత్పత్తులు, సేవలు రూపొందించాలి. సరసమైన ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి తేవడం, ఈఎంఐ లేదా ఫైనాన్స్ మోడళ్లను ప్రవేశపెట్టడం, గ్రామీణ మార్కెట్లకుచేరువ కావడం ద్వారా వినియోగదారుల స్థాయిని విస్తరించుకోవచ్చు. డిజిటల్ విస్తరణ ద్వారా కూడా ఈ వర్గానికి మార్కెట్‌ను మరింతచేరువ చేయొచ్చు.ఈ మార్గాల్లో వ్యూహాలు అమలు చేస్తే తక్కువ ఆదాయంగల వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరిగి, భారత ఆర్థికవృద్ధికి కొత్త దిశలో ఉత్సాహం లభించవచ్చు. ఆర్థిక అసమతుల్యతను అధిగమించాలంటే ఉపాధి కల్పన సరైన పరిష్కారంగా పరిగణించాలి. ప్రజల ఆదాయాన్ని పెంచేలా.. ప్రభుత్వ కార్యక్రమాలు.. ఉద్యోగ కల్పన పెంచడం, కార్మిక వేతనాలు పెంచడంతోపాటు, స్థిరమైన ఉపాధి అవకాశాలను పెంచడం, వ్యవసాయాన్ని ఆదాయ వృద్ధి మార్గంగా తీర్చిదిద్దేందుకు ఆధునికీకరణ, గోదాములు, ప్రత్యక్ష మార్కెటింగ్ విధానాలు అవసరం. వినియోగదారుల మార్కెట్ విస్తరణపై దృష్టి పెట్టడం అత్యవసరం. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వృద్ధిని సాధించవచ్చు.

# రాంపల్లిలో కొత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం లేదు : ఎంఎంసీ

## ప్రజలను తప్పుదోవ పట్టించే తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు- డిప్యూటీ కమిషనర్







**ఘట్‌కేసర్, జూలై 13, (తెలంగాణ దిశ) :** రాంపల్లి వద్ద జవహర్‌నగర్ తరహాలో కొత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఎంఎంసీ ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డి స్పష్టం చేశారు. ఎంఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుత డంపింగ్ యార్డులో అందుబాటులో ఉన్న స్థలంలో సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ పాయింట్ (ఎస్ సిటిపి) ఏర్పాటు చేయడానికి మాత్రమే స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో రోజు వారీ సేకరించే ఘన వ్యర్థాలను అదే రోజున అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతిలో స్వీకరించి, మూసివేసిన (క్లోజ్డ్) వాహనాల ద్వారా సంబంధిత ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలిస్తారని వివరించారు.

ఇక్కడ ఎలాంటి చెత్తను శాశ్వతంగా నిల్వ చేయడం లేదా డంపింగ్ యార్డు నిర్వహించడం జరగదని స్పష్టం చేశారు. కొంత మంది వ్యక్తులు ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారని, ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు. అలాగే సర్వే నంబర్ 226లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని మాత్రమే ఈ ప్రజా ప్రయోజన ప్రాజెక్టు కోసం కేటాయించాలని సంబంధిత అధికారులను కోరినట్లు తెలిపారు. ఇతర కుల సంఘాలకు కేటాయించిన లేదా కేటాయింపు ప్రతిపాదనలో ఉన్న భూములను కోరడం గానీ, స్వాధీనం చేసుకోవడం గానీ జరగలేదని, దీనిపై జరుగుతున్న ప్రచారం కూడా పూర్తిగా అవాస్తవమని వెల్లడించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా సామాజిక మాధ్యమాలు లేదా ఇతర మార్గాల ద్వారా వ్యాపిస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని, ఎంఎంసీ విడుదల చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని డిప్యూటీ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక వ్యర్థాల నిర్వహణే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి..

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి: కొలన్ హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్, జూలై 13, (తెలంగాణ దిశ) :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించి అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 277వ డివిజన్ మహాదేవపురం పరిధిలోని దేవేందర్‌నగర్, గాజులరామారం సర్కిల్‌లో ఏఈఆర్‌వో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) హెల్ప్ డెస్క్ కార్యక్రమాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో చోటు దక్కేలా చూడడంతో పాటు,ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన వివరాలతో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రజలు కూడా బీఎల్‌ఓలు అందజేసే ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా పూరించి తిరిగి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా 18 సంవత్సరాలునిండిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ప్రతి అర్హులైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సిద్ధ నోళ్ల సంజీవ్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి గణేష్, ఐఎన్‌టీయూసీ నాయకుడు దేగుల సతీష్ బాబు, లలిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, జూలై 13, (తెలంగాణ దిశ):** ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఆయన స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంచినీటి సమస్యపై స్థానికులు చేసిన ఫిర్యాదుకు స్పందించిన కూన శ్రీశైలం గౌడ్, సంబంధిత వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ శ్రీమతి మాధవితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా జగద్గిరిగుట్టలో పార్కు ఏర్పాటు చేయాలని స్థానికులు చేసిన విజ్ఞప్తిపై సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రజలు ప్రస్తావించిన ఇతర సమస్యలపై కూడా సంబంధిత అధికారులతో చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికుల నుంచి వివిధ ఆహ్వాన పత్రికలను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పేకాట స్థావరం.. డ్రోన్ నిఘాతో బహిర్గతం

అనంతపురం జిల్లా : అనంతపురం జిల్లా పోలీసులు వినూత్న విధానాలను అవలంబిస్తున్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, ముఖ్యంగా పేకాట స్థావరాలపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. అందులో భాగంగా రాయదుర్గం మండలం గొల్లలదొడ్డి గ్రామ శివారు ప్రాంతంలో శుక్రవారం యదేచ్ఛగా జరుగుతున్న పేకాట స్థావరాన్ని పోలీసులు డ్రోన్ సహాయంతో గుర్తించారు. గుర్తించడమే కాకుండా పేకాట ఆడుతున్న వారిపై మెరుపు దాడి చేశారు. పోలీసుల ఈ వినూత్న నిఘా విధానం పేకాట ఆడేవారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గొల్లలదొడ్డి గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో ఏడుగురు వ్యక్తులు గుమిగూడి పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం పోలీసులకు అందింది. అయితే గతంలో మాదిరిగా నేరుగా దాడి చేయకుండా, అనుమానితుల కదలికలను ముందుగా డ్రోన్ ద్వారా నిశితంగా పరిశీలించాలని పోలీసులు నిర్ణయించుకున్నారు. ఆకాశంలో చక్కర్లు కొడుతున్న డ్రోన్ శబ్దం వినగానే, తమ స్థావరంపై నిఘా పడిందని పేకాట ఆడేవారు గ్రహించారు.



# ఫ్యూచర్ సిటీకి విపరీతమైన క్రేజ్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ.. దేశంలో మరే ఇతరకొత్త నగర నిర్మాణానికి దక్కని అరుదైన ప్రాముఖ్యతను దక్కించుకుంది. 13,500 ఎకరాల్లో సువిశాలంగా రూపుదిద్దుకోనున్న ఈ నగరం, కేవలం రెండు రోజుల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025 విజయ ంతోనే ప్రపంచ పారిశ్రామిక పటంలో కీలక గమ్యస్థానంగా నిలిచింది. ఈ సమ్మిట్‌లో 44 దేశాల ప్రతినిధులు హాజరు కావడం, రూ.5.7 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరగడం ఫ్యూచర్ సిటీ పట్ల ఇన్వెస్టర్ల విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది.దేశంలో ఇప్పటికే అనేక స్మార్ట్ సిటీలు, కొత్త నగరాల నిర్మాణ ప్రతిపాదనలు దశాబ్దాలుగా కేవలం కాగితాలకే పరిమితమైన సందర్భాలు ఉన్నాయి. కానీ భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించడం అనేది సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ దార్శనికత, కార్యాచరణ వేగానికి నిదర్శనం అని పలువురు అభిప్రాయపడు తున్నారు. సమ్మిట్ ముగిసిన వెంటనే ఫ్యూచర్ సిటీ కార్యరూపం దాల్చడానికి మార్గం సుగమమైంది. మౌలిక సదుపాయాలు, డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్,ఫార్మా, ఎంటర్టైన్మెంట్, డిఫెన్స్, ఏఐ వంటి రంగాలకు లక్షల కోట్ల పెట్టుబడులు తరలివస్తున్నాయి. ఈ ప్రాంతాన్ని నివాస కేంద్రంగా, వ్యాపార, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.భారత్ ఫ్యూచర్ సిటీ నగరాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్, క్రీడలు, డేటా సెంటర్స్, అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల జిల్లాలుగా మొత్తం ఆరు విభాగాలుగా నిర్మించనున్నారు. ముఖ్యమైన నిర్మాణ ప్రక్రియలో భాగంగా డేటా సెంటర్ల కోసం 400 ఎకరాలు కేటాయించారు, వచ్చే ఫిబ్రవరి చివరిలో నిర్మాణాలు ప్రారంభం కానున్నాయి. ఇక మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కార్యక్రమాలు మొదలవుతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షల మేరకు ఈ 13,500 ఎకరాల నగరాన్ని జీరో కార్బన్ సిటీగా రూపొందించే లక్ష్యంతో.. నగరం అంతటా అర్బన్ ఫారెస్టులు, రెయిన్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఫార్మా, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో పరిశోధన, మ్యాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఇక్కడ ఉంటాయి. ఈ నగరం సమగ్ర జీవన కేంద్రంగా ఉండనుంది. ఇక్కడ 13 లక్షల మందికి ఉద్యోగాలు, 9 లక్షల జనాభా కోసం నివాస సముదాయాలు ఏర్పాటవుతాయి. అంతేకాకుండా రిలయన్స్ ఫౌండేషన్ వంతారతో వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ఏర్పాటుతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లు, స్టార్ హోటళ్లు, రేసింగ్ ట్రాక్‌లు వంటి వినోద, క్రీడా సౌకర్యాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం అద్భుతమైన మౌలిక వసతులు,అత్యాధునిక రవాణా వ్యవస్థలతో ఒక ఆర్కిటెక్చరల్ అద్భుతంగా నిలవనుంది. సమ్మిట్ విజయం తర్వాత దేశంలో ఏ కొత్త నగరానికి దక్కని ప్రాముఖ్యత ఈ ప్రాజెక్ట్‌కు దక్కింది. ఇది తెలంగాణ విజ న్–2047 లక్ష్యాలకు అనుగుణంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# చమురు ట్యాంకర్‌ను సీజ్ చేసిన ఇరాన్

న్యూఢిల్లీ: ఒమన్‌లో భారీ పరిమాణంలో చమురును మోసుకెళ్తున్న ఒక నౌకను ఇరాన్ సీజ్ చేసింది. అందులో భారతీయులతోపాటు శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు చెందిన 18 మంది సిబ్బంది ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన జరిగింది. 60 లక్షల లీటర్ల చమురును అక్రమంగా తరలిస్తున్నారని, అందుకే నౌకలోని నావిగేషన్ వ్యవస్థలన్నింటినీ నిలిపివేశారని ఇరాన్ మీడియా వెల్లడించింది. గల్ఫ్‌లో అక్రమంగా ఇంధనం రవాణా చేస్తోన్న నౌకలను అడ్డుకుంటున్నట్లు ఇరాన్ ఇప్పటికే పలుమార్లు వెల్లడించింది. చమురు ఎగుమతి చేస్తోన్న దేశాల్లో ఒకటైన ఇరాన్‌లో చమురు ధరలు అతి తక్కువగా ఉంటాయి. అందుకే ఇక్కడినుంచి ఇతర దేశాలకు అక్రమంగా ఎగు మతి చేసి, కొందరు భారీ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ కార్యకలాపాలను ఇరాన్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటోంది. కాగా వెనెజువెలా తీరంలో రెండు రోజుల క్రితం అమెరికా ఒక ఆయిల్ ట్యాంకర్‌ను సీజ్ చేసింది. నౌక కెప్టెన్ వెనెజువెలా, ఇరాన్‌ల నుంచి అక్రమంగా చమురు రవాణా చేస్తున్నాడన్న ఆరోపణలతో ఈ నౌకను అగ్రరాజ్యం అడ్డుకుంది. వెనెజువెలా తీరం నుంచి క్యూబాకు బయలుదేరిన ఈ భారీ నౌకను అమెరికా సైనికులు తమ అధీనంలోకి తీసుకున్నారు. హెలికాప్టర్?లో వెళ్లి షిప్‌పై దిగారు. ఆయుధాలతో షిప్ సిబ్బందిని చుట్టుముట్టిన వీడియోను అమెరికా మీడియాకు విడుదల చేసింది.

ఇప్పటి వరకు సీజ్ చేసిన వాటిలో ఇదే అతిపెద్ద ఆయిల్ ట్యాంకర్ డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇకముందు కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతాయని అన్నారు. అది జరిగిన రెండు రోజులకే ఇరాన్ ఈ నౌకను సీజ్ చేసింది. ప్రపంచ చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉన్న హార్మూజ్ జలసంధి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20 శాతం హార్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం–ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది.

దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల బారెళ్ల చమురు వివిధ దేశాలకు వెళ్తుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది.

# పరగడుపునే బెల్లం నీళ్లను తాగితే ఇన్ని ఉపయోగాలు ఉన్నాయా..?



బెల్లాన్ని సహజసిద్ధమైన పద్ధతిలో తయారు చేస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకనే తీపి తినాలనుకునే వారు చక్కెరకు బదులుగా బెల్లం తింటే మంచిదని వైద్య నిపుణులు కూడా చెబుతుంటారు. అయితే రోజూ బెల్లం తినడం కష్టం అనుకునే వారు బెల్లాన్ని నీటిలో కలిపి కూడా తాగవచ్చు. ఈ విధంగా బెల్లం నీళ్లను తాగడం వల్ల కూడా మనకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. చిన్న బెల్లం ముక్కను రాత్రి పూట ఒక గ్లాస్ నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ నీళ్లను సేవించాలి. దంతాలను తోముకున్న తరువాతే ఈ నీళ్లను తాగాలి. ఉదయం బెల్లం నీళ్లను సేవిస్తే శరీరానికి శక్తి లభిస్తుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం, అలసట ఉండవు.


రోగాల నుంచి రక్షణ..: బెల్లం నీళ్లను తాగడం వల్ల జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. జీర్ణాశయంలో ఎంజైమ్ ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. బెల్లం నీళ్లను తాగడం వల్ల లివర్ శుభ్రంగా మారుతుంది. లివర్‌లోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. లివర్‌లోని కొవ్వు కరుగుతుంది. ఫ్యాటీ లివర్ ఉన్నవారు బెల్లం నీళ్లను తాగుతుంటే ఫలితం ఉంటుంది. బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌తో పోరాటం చేస్తాయి. కణాలు దెబ్బ తినకుండా చూస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. బెల్లంలో అనేక యాంటీ ఆక్సిడెంట్లతోపాటు మినరల్స్ కూడా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను బలంగా మారుస్తాయి. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది.

రక్తహీనతకు ఔషధం..: బెల్లంలో ఉండే ఐరన్, ఫోలేట్ మహిళలకు ఎంతో మేలు చేస్తాయి. వారిలో నెలసరి సమయంలో వచ్చే నొప్పులను తగ్గిస్తాయి. తీవ్ర రక్త స్రావం జరగకుండా చూస్తాయి. అలాగే ఈ నీళ్లను తాగడం వల్ల రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. బెల్లంలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. అలాగే బెల్లం నీళ్లను తాగితే శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బెల్లం నీళ్లను తాగడం వల్ల లభించే మినరల్స్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం కాంతివంతంగా మారి మెరిసేలా చేస్తాయి.

రాత్రి కూడా తాగవచ్చు..: బెల్లం నీళ్లను ఉదయం తాగడం వీలు కాదు అనుకునే వారు రాత్రి పూట భోజనం చేసిన తరువాత లేదా నిద్రకు ముందు తాగవచ్చు. అయితే బెల్లం శరీరంలో వేడిని పెంచుతుంది. కనుక బెల్లం నీళ్లను చల్లగా తాగితే మేలు. ఈ నీళ్లను తాగితే కొందరికి పడకపోవచ్చు.

విరేచనాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారు ఈ నీళ్లను తాగకపోవడమే మంచిది. నాణ్యమైన బెల్లంతో తయారు చేసిన నీళ్లనే తాగాలి. బెల్లం క్వాలిటీగా లేకపోయినా కూడా అనారోగ్య సమస్యలు వస్తాయి. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు పని ముగిసిన తరువాత బెల్లం నీళ్లను తాగితే శరీరానికి శక్తి లభిస్తుంది. మళ్లీ ఉత్సాహంగా మారుతారు. ఇలా బెల్లం నీళ్లను సేవించడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# గుండె ఇలా పదిలం



గుండె ఆరోగ్యం కోసం రాత్రికి రాత్రే జీవితాన్ని పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం లేదు. చిన్నచిన్న, స్థిరమైన మార్పులు.. మీ హృదయాన్ని రక్షించడంలో సహాయపడతాయి. అందుకోసం కింది చిట్కాలను పాటిస్తే సరి.. క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల నడక.. గుండె ఆరోగ్యాన్ని రెట్టింపు చేస్తుంది. నాలుకకు నచ్చేలా కాదు.. మనసుకు నచ్చేలా తినండి. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ.. కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులకు ఆహారంలో చోటివ్వండి. నిద్రకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వండి. ప్రతిరోజూ రాత్రిపూట 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్ర ఉండేలా చూసుకోండి. ధూమపానం, మద్యపానం అలవాటు ఉంటే.. వెంటనే మానేయండి. ఇంట్లో ఎవరైనా ధూమపానం చేస్తుంటే.. వారికి దూరంగా ఉండాలి. ఒత్తిడి, భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవడానికి యోగా, ధ్యానం లాంటివి ప్రయత్నించండి.

# ఈ బెర్రీలను ఎప్పుడైనా తిన్నారా..?

## వీటితో కలిగే లాభాలు తెలిస్తే షాకవుతారు..!

బెర్రీలు.. ఈ పండ్ల పేరు చెప్పగానే మనకు స్ట్రాబెర్రీలు, క్రాన్ బెర్రీలు, బ్లూబెర్రీల వంటి పండ్లు గుర్తుకు వస్తాయి. కానీ బెర్రీల్లో ఇంకా అనేక వెరైటీలు ఉన్నాయి. వాటిల్లో రొవాన్ బెర్రీలు కూడా ఒకటి. ఇవి చూసేందుకు చిన్నపాటి చెర్రీ పండ్ల మాదిరిగా ఉంటాయి. ఇవి మనకు ఎక్కువగా సూపర్ మార్కెట్లలోనే లభిస్తాయి. రొవాన్ బెర్రీలను డ్రై ఫ్రూట్స్ రూపంలోనూ విక్రయిస్తారు. అయితే రొవాన్ బెర్రీలలో పారాసోర్బిక్ యాసిడ్ ఉంటుంది. కనుక ఈ పండ్లను నేరుగా తినకూడదు. కాస్త ఉడకబెట్టి లేదా డ్రై ఫ్రూట్స్ రూపంలో తినాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ పండ్లను నేరుగా తింటే పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుందని అంటున్నారు. ఇక రొవాన్ బెర్రీలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలు ఉంటాయని వారు అంటున్నారు.

డయాబెటిస్ ఉన్నవారికి వరం..: రొవాన్ బెర్రీలలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను బలంగా మారుస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీంతో శరీరం వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొంటుంది. అలాగే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. రొవాన్ బెర్రీలలో పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గేలా చేస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా అడ్డుకోవచ్చు. రొవాన్ బెర్రీలలో సార్బిటాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆల్కహాల్‌కు చెందిన ఒక సమ్మేళనం. ఇది షుగర్ లెవల్స్ తగ్గేలా చేస్తుంది. మధుమేహం ఉన్నవారు రొవాన్ బెర్రీలను తింటుంటే షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. ఈ బెర్రీలు తియ్యగా ఉన్నప్పటికీ వీటిల్లో ఉండే సార్బిటాల్ కారణంగా వీటిని తింటే షుగర్ లెవల్స్ పెరగవు. పైగా షుగర్ లెవల్స్ తగ్గేలా చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారికి ఈ పండ్లను వరంగా చెప్పవచ్చు.

మలబద్ధకానికి ఔషధం..: రొవాన్ బెర్రీలు సహజసిద్ధమైన లాక్సేటివ్ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. రొవాన్



బెర్రీలలో ఫినోలిక్స్, టెర్పినాయిడ్స్ అనే బయో యాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. దీని వల్ల ఆర్థరైటిస్ నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్ల నొప్పులు ఉన్నవారు ఈ పండ్లను తింటుంటే ఎంతో ఉపశమనం లభిస్తుంది. రొవాన్ బెర్రీలలో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే మన శరీరంలో చేరే బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లు నిర్మూలించబడతాయి. ముఖ్యంగా ఇ.కోలి వంటి బ్యాక్టీరియా నాశనం అవుతుంది. దీంతో అనేక వ్యాధుల రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి..: రొవాన్ బెర్రీలలో కెరోటినాయిడ్స్ అధికంగా ఉంటాయి. లుటీన్ అధికంగా ఉంటుంది. దీని వల్ల కంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది. కంటి చూపు పెరుగుతుంది. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. రొవాన్ బెర్రీలలో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు, వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. రొవాన్ బెర్రీలను ఆహారంలో భాగం చేసుకుంటే వాపులు తగ్గుతాయి. దీంతో గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. ముక్కు దిబ్బడ తగ్గుతుంది. ఇలా రొవాన్ బెర్రీలను తరచూ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# సంతాన సఫలతకు వడదెబ్బ



మాతృత్వ మాధుర్యాన్ని కోరుకునే స్త్రీలకు హీట్‌వేవ్ (వడగాలి) ఉపద్రవంలా మారింది. వీపరీతమైన ఎండ మహిళల పునరుత్పత్తి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, వేడి వాతావరణం, వడగాలుల కారణంగా మానసికంగా, శారీరకంగా స్త్రీలలో ఒత్తిడి పెరుగుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

అధిక ఉష్ణోగ్రతలకు ఎక్కువసేపు గురికావడం వల్ల కార్టిసాల్ వంటి ఒత్తిడిని పెంచే హార్మోన్ల ఉత్పత్తి పెరగడం, స్త్రీలలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ వంటి హార్మోన్లపై ప్రభావం చూపుతున్నట్టు పేర్కొంటున్నారు. ఈ హార్మోన్ల అసమతుల్యత కారణంగా రుతుక్రమ సమస్యలు ఉత్పన్నమవుతున్నట్టు చెప్పారు. దీని ప్రభావం అండాల విడుదల (ఓవులేషన్)పై పడుతున్నదని.. ఈ రెండు అంశాలు గర్భధారణకు సవాలుగా మారుతున్నట్టు వెల్లడించారు. వేసవిలో జరిగే ఈ మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటే ఇంబాలెన్సెస్ (అసమానతల)ను గుర్తించవచ్చని వైద్యులు అంటున్నారు.

వేసవిలో శరీరం నుంచి చెమట ద్వారా ఎక్కువ ఫ్లూయిడ్స్‌ను కోల్పోతారు. కాబట్టి, ఎప్పటికప్పుడు శరీరానికి అవసరమైన ద్రవ పదార్థాలను తగిన మొత్తంలో తీసుకోవాలని సూచిస్తున్నారు. వీర్యం అండాన్ని చేరడానికి సహాయపడే గర్భాశయ శ్లేష్మం హైడ్రేషన్‌పైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. శ్లేష్మం తక్కువగా ఉన్నా.. లేదా మందంగా ఉన్నా.. అది వీర్యం కదలికకు ఆటంకం కలిగిస్తుందని తెలిపారు. గర్భధారణ కోరుకునే మహిళలు వడగాలుల సమయంలో ప్రతీరోజు 8 నుంచి 10 గ్లాసుల నీరు తప్పనిసరిగా తాగడం ద్వారా సంతాన సామర్థ్యం పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

నిద్ర, పౌష్టికాహారంc పునరుత్పత్తికి దోహదపడే హార్మోన్లను నియంత్రించే ప్రక్రియలో నిద్ర కీలక పాత్ర వహిస్తుంది. అయితే, వేసవిలో స్త్రీలకు తగినంత నిద్రపట్టడం కష్టంగా మారుతుంది. నిద్రలేమి కారణంగా మెలటోనిన్ అనే హార్మోన్ స్థాయి తగ్గి అది అండాల విడుదలపై ప్రభావితం చూపుతుందని వైద్యులు తెలిపారు. అందుకే నిద్రపోయేటప్పుడు యూవీ కిరణాలు, సూర్యకాంతి, వేడిని నిరోధించే బ్లాక్ అవుట్ కర్టెన్లు, కాటన్ బెడ్‌షీట్లతోపాటు గది చల్లగా ఉండేలా చూసుకోవాలి. సంతానోత్పత్తికి కంటినిండా నిద్ర కీలకమని సూచిస్తున్నారు. వేసవిలో ప్రయాణాలు కూడా కొన్నిసార్లు రుతుచక్రాన్ని దెబ్బతీస్తాయని.. ప్రయాణాలతో కలిగే ఒత్తిడి కూడా అండాల విడుదలపై ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వడగాలుల సమయంలో వేడి కారణంగా ఆకలి తగ్గుతుంది. దీంతో కొన్నిసార్లు తక్కువ పోషక పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటారు. సంతానోత్పత్తి పౌష్టికాహారంపై ఆధారపడి ఉంటుంది కాబట్టి, స్త్రీలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి: ఫోలిక్ యాసిడ్, ఐరన్, జింక్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు వంటి ముఖ్యమైన పోషకాలు ఆరోగ్యకరమైన అండాల అభివృద్ధికి దోహదపడతాయి. అందువల్ల, ఆయా కాలాల్లో లభించే పండ్లు, ఆకుకూరలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్లు ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. హైడ్రేటింగ్ సమస్యలను తప్పించుకోవడానికి కొబ్బరినీళ్లు క్రమం తప్పకుండా తాగాలి. వేసవిలో ఎండవేడి మానసిక ఆరోగ్యంపై సైతం ప్రభావితం చూపుతుంది. గర్భందాల్చడానికి ప్రయత్నిస్తున్న స్త్రీలు అప్పటికే భావోద్వేగ ఒత్తిడికి లోనవుతారు. అదనంగా వేసవి కారణంగా ఈ ఒత్తిడి మరింత పెరుగుతుంది. ఇలాంటప్పుడు సోషల్ మీడియాకు దూరంగా ఉండటం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు చెబుతున్నారు. ఎండలో బయటికి వెళ్లినప్పుడు సన్‌స్క్రీన్ లోషన్లు తప్పనిసరిగా వాడాలని, హైడ్రేటెట్‌గా ఉండాలని సూచించారు.

# ఈ చిట్కాలను పాటిస్తే మీ పెదవులు సహజసిద్ధంగా పింక్ రంగులోకి



చర్మం, శిరోజాల తరువాత చాలా మంది అందంగా కనిపించాలని కోరుకునే అవయవాల్లో పెదవులు మూడో స్థానంలో ఉంటాయని చెప్పవచ్చు. మహిళలు ఎక్కువగా పెదవుల అందానికి ప్రాధాన్యతను ఇస్తుంటారు. పెదవులు అందవిహీనంగా కనిపిస్తే ఎవరికీ మనశ్శాంతిగా ఉండదు. పెదవులు పొడిబారడం లేదా నల్లగా మారడం, కాంతిని కోల్పోవడం వంటివి జరుగుతుంటాయి. ఇందుకు అనేక కారణాలుఉంటాయి. అయితే పెదవుల అందానికి ఖరీదైన బ్యూటీ పార్లర్ చికిత్సలు అవసరం లేదు. మన ఇంట్లోఉండే పదార్థాలతోనేఅత్యంత సహజసిద్ధం గా పెదవులను అందంగా మార్చుకోవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. పెదవులను అందంగా మార్చడంలో చక్కెర, తేనె ఎంతగానో ఉపయోగపడతాయి. రెండింటినీ కలిపి పేస్ట్‌లా చేసి పెదవులపై మసాజ్ చేసినట్లు రాయాలి. దీంతో మృత చర్మ కణాలు పోతాయి. పెదవులు కాంతివంతంగా మారి అందంగా కనిపిస్తాయి. ఈ చిట్కాను వారంలో 2 సార్లు పాటించాలి. తేనె..: పెదవులను అందంగా మార్చడంలో కొబ్బరినూనె కూడా పనిచేస్తుంది. ఈ నూనెను చాలా మంది శిరోజాల సంరక్షణకు ఉపయోగిస్తుంటారు. కానీ కొబ్బరినూనెను రాయడం వల్ల పెదవులు కూడా అందంగా మారి రక్షించబడతాయి. రాత్రి పూట నిద్రకు ముందు కొద్దిగా కొబ్బరినూనెను పెదవులకు మసాజ్ చేసినట్లు రాయాలి. ఉదయం కడిగేయాలి. ఇలా చేస్తుంటే పెదవులు మృదువుగా మారుతాయి. సహజసిద్ధమైన నిగారింపును పొందుతాయి. పెదవులు పొడిబారడం తగ్గుతుంది. తేనె పెదవులకు తేమను అందిస్తుంది. తేనెను కొద్దిగా తీసుకుని పెదవులకు రాసి 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. రోజూ ఇలా చేస్తుంటే పెదవులు అందంగా మారుతాయి. పెదవులపై ఉండే నలుపుదనం పోతుంది. మృత చర్మ కణాలుతొలగిపోయిపెదవులు కాంతివంతంగా కనిపిస్తాయి.

బీట్ రూట్ జ్యూస్..: పెదవులపై బీట్‌రూట్ జ్యూస్‌ను అప్లై చేయడం వల్ల కూడా ఫలితం ఉంటుంది. కొద్దిగా బీట్ రూట్ జ్యూస్‌లో ముల్లంగి రసం కలిపి పెదవులపై రాసి 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. రోజూ ఇలా చేస్తుంటే మీ పెదవులపై ఉండే నలుపుదనం తగ్గిపోతుంది. మీ పెదవులు సహజసిద్ధంగా పింక్ రంగులోకి మారుతాయి. కలబంద గుజ్జును కొద్దిగా తీసుకుని పెదవులపై రాసి 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. కలబందలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు పెదవుల వాపులను తగ్గించి ఇన్‌ఫెక్షన్లను దూరం చేస్తాయి. దీంతో పెదవులు సహజసిద్ధమైన నిగారింపును పొందుతాయి. రాత్రి పూట పెదవులపై కాస్త నెయ్యిని రాసి ఉదయం కడిగేస్తున్నా కూడా ఫలితం ఉంటుంది. అయితే నెయ్యిని ఉపయోగించే ముందు కాస్త వేడి చేస్తే మంచిది. పాలు, గులాబీల మిశ్రమం..: రాత్రంతా గులాబీ పువ్వుల రెక్కలను పాలలో వేసి నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఆ మిశ్రమాన్ని మెత్తని పేస్ట్‌లా చేయాలి. దాన్ని పెదవులపై రాయాలి. 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే పెదవులు పింక్ రంగులోకి సహజసిద్ధంగా మారిపోతాయి. రాత్రి పూట నిద్రకు ముందు పెదవులపై బాదంనూనెను రాస్తున్నా ప్రయోజనం ఉంటుంది. పెదవులు సురక్షితంగా ఉంటాయి.

# పాదాలు పదిలం



శరీరంలో అన్ని భాగాలపై దాడి చేసే వ్యాధి డయాబెటిస్. ఈ వ్యాధి కారణంగా రక్తంలో ఉండే అధిక చక్కెర స్థాయిలు కండ్లు, కిడ్నీలు, గుండె ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. అయితే, ఈ అవయవాలు మాత్రమే కాదు మధుమేహ వ్యాధిగ్రస్తుల పాదాలకు కూడా ముప్పు పొంచి ఉంటుంది. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో పాదాల సమస్యలు చాలానే ఉంటాయి. దీన్నే డయాబెటిక్ ఫూట్ అంటారు. ఈ సమస్యకు నిర్ణీత సమయంలో చికిత్స తీసుకోకపోతే పాదాల్లో పుండ్లు (అల్సర్లు) ఏర్పడతాయి. కాబట్టి, పొరపాటున కూడా డయాబెటిక్ ఫూట్ లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

నిజానికి మధుమేహ: వ్యాధిగ్రస్తుల్లో అధిక చక్కెర స్థాయులు కాలక్రమంలో నాడులను ధ్వంసం చేస్తాయి. దీన్ని డయాబెటిక్ న్యూరోపతి అని పిలుస్తారు. ఈ పరిస్థితిలో పాదాలకు తగినంతగా రక్త ప్రసారం జరగదు. దీంతో పాదాల్లో నొప్పి, గాయాలను గుర్తించడం కష్టమైపోతుంది. కొన్నిసార్లు ఈ గాయాలు తీవ్రమైన ఇన్ఫెక్షన్లకు దారితీస్తాయి. అవి తగ్గడానికి చాలా సమయం పడుతుంది కూడా!

లక్షణాలు: పాదాలు, వేళ్ల దగ్గర తిమ్మిర్లు, మొద్దుబారినట్టు ఉండటం. కాళ్లలో మంట లేదంటే తీవ్రమైన నొప్పి. తొందరగా నయం కాని పుండ్లు, బొబ్బలు. ఎక్కడో ఓ చోట గాయం. పాదాల చుట్టూతా ఎర్రగా కందిపోవడం, వాపు. పాదాల్లో పగుళ్లు, పొడి చర్మం, రక్తస్రావం. చర్మంపై గాఢమైన నల్లటి మచ్చలు. గాయం నుంచి దుర్వాసన, రసి కారడం. పాదాల్లో ఏదైనా అవకరం.

నివారణ ఎలా?: పాదాలను శుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. గోళ్లు కత్తిరించుకుని, శుభ్రంగా ఉంచుకోవాలి. పాదాలపై పులిపిర్లు, గాయాలు, మంటగా ఉండటం లాంటివాటిని గమనిస్తూ ఉండాలి. పాదాలను గోరువెచ్చటి నీటితో కడుక్కోవాలి. వేళ్ల మధ్య భాగాన్ని పొడిగా ఉంచుకోవాలి. పాదాలకు అసౌకర్యంగా ఉండని తగిన షూస్‌నే ధరించాలి. ధూమపానం చేయొద్దు. ఉట్టి కాళ్లతో నడవకూడదు. వీటికి అదనంగా రక్తంలో చక్కెర స్థాయులను అదుపులో ఉంచుకోవాలి. చక్కెర స్థాయులను క్రమం తప్పకుండా పరీక్షించుకుంటూ ఉండాలి. వైద్యుడి సలహాలను అనుసరించాలి.

# చిరుధాన్యాలతో ఘన విజయం





ఆరోగ్యమే మహాభాగ్యం. మరి అలాంటి ఆరోగ్యం బాగుండాలంటే మంచి ఆహారం అవసరం. కానీ, ఆహార వ్యవహారాలను మారిన జీవనశైలి తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ప్రాసెస్డ్ జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. దీంతో వయసుతో సంబంధం లేకుండా బీపీ, డయాబెటిస్ కొని తెచ్చుకుంటున్నారు. మరి ఇలాంటి పరిస్థితుల్లో 'ఆరోగ్యకరమైన ఆహారం మీ కోసం' అని ముందుకొచ్చింది పలక్ అరోరా. 'మిల్లియమ్' బ్రాండ్ పేరిట రెడీ టు కుక్ మిల్లెట్ మిక్స్‌తో ఆంత్రప్రెన్యూర్‌గా రాణిస్తున్న 26 ఏండ్ల పలక్ అరోరా కథ ఇది..

మిల్లెట్ పంటలు ఎలాంటి వాతావరణాన్నైనా తట్టుకుంటాయి. అలాగే వరి, గోధుమలకు కావాల్సినంత నీళ్లు ఈ చిరుధాన్యాల సాగుకు అవసరం లేదు. వీటివల్ల మట్టి కూడా సారవంతం అవుతుంది. అలాగే అందరికీ ఆరోగ్యం అనే కాన్సెప్ట్ నాది. వ్యవసాయ క్షేత్రం నుంచి కిచెన్ వరకు అన్ని దశల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని ప్రారంభించాను.హర్యానాలోని ఫరీదాబాద్‌కు చెందిన పలక్ వాళ్లింటి టెర్రస్‌పై రకరకాల చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులు తయారు చేస్తున్నది. 'మిల్లియం' ఫుడ్ బ్రాండ్‌తో నేటితరానికి సంప్రదాయ చిరుధాన్యాలను పరిచయం చేస్తున్నది. స్థానిక రైతుల నుంచి చిరుధాన్యాలు కొనుగోలు చేసి.. రకరకాల వెరైటీలు అందిస్తున్నది. ఈ మిల్లెట్ మిక్స్‌లు బిజీబిజీగా ఆఫీసులకు పరిగెత్తేవాళ్లకు రెడీమేడ్‌గా రుచితోపాటు ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తున్నాయి.

**నాన్న ఆరోగ్యం కోసం..:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఫుడ్ ఇంజినీరింగ్ చేసింది పలక్. ఆమె మూడో సంవత్సరంలో ఉన్నప్పుడే రోగనిరోధక శక్తిని పెంచే ఆహారంపై పరిశోధన ప్రారంభించింది. ఆ సమయంలోనే పలక్ తండ్రికి మూత్రపిండాల సమస్య వచ్చింది. దానికి కారణం ఆయన దీర్ఘకాలంగా పోషకాహారం తీసుకోకపోవడమే అని డాక్టర్లు చెప్పారు. దాంతో తన కుటుంబానికి ఆరోగ్యకర ఆహారం అందించాలన్న లక్ష్యంతో ఈ చిరుధాన్యాల వైపు అడుగులు వేసిందామె.

**మాతో పాటు అందరికీ..:** 'మా నాన్న అనారోగ్యానికి గురైనప్పుడు మా కుటుంబమంతా ఒక్కసారిగా కుంగిపోయింది. ఫుడ్ ఇంజినీరింగ్ చేస్తున్న నాకు ఆహారమే మహాభాగ్యమని తెలిసినా, ఇంటి ఆహారాన్ని సరిగ్గా పట్టించుకోలేదు. కానీ, డాక్టర్లు మేము తినే ఆహారంలో పోషకాలు లేవన్నప్పుడు, నేను మన ముందు తరాల వాళ్లు తీసుకునే ఆహారం గురించి ఆరా తీశాను. వారి ప్రధాన ఆహారం చిరుధాన్యాలే అని తెలిసింది. దాంతో మా కుటుంబ ఆరోగ్యంతో పాటు నలుగురికీ ఈ ఆహారం అందించాలనుకున్నాను. అలా మొదలైందే మా 'మిల్లియం' బ్రాండ్. స్థానికంగా చిరుధాన్యాలు పండించే రైతులను సంప్రదించాను. వారి నుంచి మేలు రకం ధాన్యం కొనుగోలు చేస్తున్నాను. దీనిద్వారా వాళ్లకూ మంచి గిట్టుబాటు దక్కుతున్నది. నాకూ నాణ్యమైన ధాన్యం లభిస్తున్నది. అంతేకాదు, నాకు ఆంత్రప్రెన్యూర్ అవ్వాలన్నది ఎంత ఇష్టమో.. నలుగురికి ఉపాధి కల్పించడమూ అంతే ఆనందం. ఉత్పత్తుల తయారీ, ప్యాకింగ్ కోసం కొందరిని తీసుకున్నాం. వారంతా ఇప్పుడు సంతోషంగా ఉన్నారు' అని చెప్పుకొచ్చింది పలక్.





**పురాతన ధాన్యాల్లోనే ఆరోగ్యం..:** కరోనా లాక్‌డౌన్ సమయంలో పలక్ ఈఫుడ్ ప్రయోగాలు ప్రారంభించింది. కేవలం సోలార్ డ్రైయర్స్, బ్లెండర్స్‌తో చిరుధాన్యాలను శుభ్రం చేసి పొడి చేసేది. ఇలా పొడులైతే ఉద్యోగులకు త్వరగా వండుకునే అవకాశం ఉంటుందని పలక్ ఉద్దేశం. అప్పుడే ఆమె ప్రభుత్వరంగ సంస్థల నుంచి సర్టిఫికెట్లు పొంది, పూర్తిస్థాయి ఆంత్రప్రెన్యూర్‌గా మారింది. గోధుమ పిండిని ప్రజలు ఎలా విరివిగా వాడుతున్నారో, ఈ చిరుధాన్యాల మిక్స్‌లను కూడా అలాగే వాడాలన్నది తన లక్ష్యం అంటుంది పలక్.

**కుటుంబ ప్రోత్సాహం..:** ప్రయోగాల పేరిట కుస్తీ పడుతున్న కూతురుని తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు ప్రోత్సహించారు. ఈ ఫుడ్ ప్రొడక్ట్ తయారీలో తన తల్లి ఎంతో సహకరిస్తుందని పలక్ చెప్పుకొచ్చింది. రుచి చూడడం, పరిమాణాల్లో మార్పులు చెప్పడం వంటివి ఆవిడే చెప్పేవారట. అలా ఆర్థికంగా, ఎమోషనల్‌గా ఫ్యామిలీ ఎంతగానో సపోర్ట్‌గా నిలిచిందంటుంది పలక్.

'మిల్లియం' బ్రాండ్ మొదటి ప్రొడక్ట్ రెడీ ఫర్ కుక్ పోరిడ్జ్. తర్వాత వెజిటేబుల్ మిక్స్ ఇడ్లీ పిండి, పంజాబీ ట్కస్టెల్ చీలా పొడి ఇలా రకరకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నది. 2021 సెప్టెంబర్‌లో పలక్ తన కంపెనీని రిజిస్టర్ చేయించింది. తర్వాత 2022 జూన్‌లో మిల్లియం బ్రాండ్‌ను లాంచ్ చేసింది.

**టన్నుల కొద్దీ ఉత్పత్తి..:** ఒకప్పుడు టెర్రస్‌నే కిచెన్‌గా మార్చుకున్న పలక్ ఇప్పుడు ఫరీదాబాద్‌లో భారీ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను స్థాపించింది. నెలకు ఎనిమిది టన్నుల 'రెడీ టు కుక్', 21 టన్నుల 'రెడీ టు ఈట్ మిల్లెట్ ప్రొడక్ట్స్' ఉత్పత్తి చేస్తున్నది. అందులో రాగి సూప్, మిల్లెట్ నూడుల్స్, పాస్తా, మిల్లెట్ పోహా, పాన్ కేక్ మిక్స్ ఇలా 15 రకాల ఉత్పత్తులు ఉన్నాయి. అందుబాటు ధరల్లోనే విక్రయిస్తున్నది. అలాగే తన ఉత్పత్తులను హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సర్వీసులకు అందిస్తూనే, దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుంటున్నది. 'హెల్దీ బీ జల్దీ బీ' అనే ట్యాగ్‌లైన్‌తో విపణిలోకి ప్రవేశించిన పలక్‌కు ఆదిలో ఆటుపోట్లు ఎదురైనా తట్టుకొని నిలబడింది. ఇప్పుడు నెలకు లక్షల్లో టర్నోవర్ సాధిస్తూ.. వినియోగదారులకు రెడీమేడ్ ఆరోగ్యాన్ని అందిస్తున్నది.

# స్వర్ణగ్రామాలుగా సచివాలయాలు

విజయవాడ, : ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఏపీలో గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. వాటి పేర్లను స్వర్ణగ్రామం శాఖగా మార్చను నట్లు ప్రకటించారు. కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ అవుతాయని తెలిపారు. ఒకటి లేదా లేదు రోజుల్లో దీనికి సంబంధించి జీవో జారీ చేసే అవకాశముందని తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిల్లో చాలా మార్పులు చేస్తుండగా.. ఇప్పుడు పేరును మార్చడం చర్చనీయాంశంగా మారింది.అమరావతిలోని సచివాలయంలో బుధవారం కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈసమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా వాటి పేరును స్వర్ణగ్రామంగా త్వరలో మార్చుతున్నట్లు చంద్రబాబు స్పష్టతిచ్చారు. వీటి పేరును మార్చుతారనే ప్రచారం ఎప్పటినుంచో జరుగుతోంది. స్వర్ణంధ్ర విజన్-2047లో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాను విజన్ యూనిట్లుగా ఉపయోగించుకోవాలని గతంలో చంద్రబాబు సూచించారు. విజన్ సాధించడంలో వీటి పాత్ర కీలకమని తెలిపారు. ఆ విజన్‌లో భాగంగా రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక తయారుచేశారు.ఈ క్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్చడం హాట్‌టాపిక్‌గా మారింది.గ్రామ స్థాయిలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇంతకముందు ఏదైనా ప్రభుత్వ సేవలు, సర్టిఫికేట్లు పొందాలంటే ఎమ్మార్వో ఆఫీస్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ రోజులపాటు తిరగాల్సి వచ్చేది. కానీ గ్రామ సచివాలయాలు వచ్చాక ఊర్లోనే ప్రజలు అన్నీ ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. ఏదైనా సర్టిఫికేట్ కావాలన్నా ఇక్కడికి వెళ్లి దరఖాస్తు పెట్టుకుంటే వెంటనే మంజూరు చేస్తున్నారు. అందుకేకాకుండా సచివాలయ ఉద్యోగులు నేరుగా ఇంటికి వచ్చి సేవలు అందిస్తున్నారు.

### నారాయణపూర్ గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన హరి పుష్పలత, అశోక్

**కోహెడ,తెలంగాణ దిశ:** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నారాయణపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్‌గా ఎన్నికైన హరి పుష్పలత, అశోక్ మరియు ఉప సర్పంచ్ మరియు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలక మండలికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం సర్పంచ్ హరి పుష్పలత, అశోక్ మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. త్రాగునీటి సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు.

# వాట్సాప్ లో టిక్కెట్ల బుకింగ్

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు శుభవార్త చెప్పింది! ఇకపై ఏపీఎస్ఆర్టీసీ బస్సు టికెట్లను వాట్సాప్ ద్వారానే సులభంగా బుక్ చేసుకోవచ్చు. 9552300009 నంబర్‌కు 'ఊఎ' అని మెసేజ్ పంపి, ప్రయాణ వివరాలు అందించి, ఆన్‌లైన్‌లో పేమెంట్ చేస్తే చాలు. టికెట్ మీ వాట్సాప్‌కే వస్తుంది. ఈ కొత్త సేవను ప్రయాణికులు ఉపయోగించుకోవాలని ఆర్టీసీ సూచిస్తోంది. ప్రయాణికులు నిమిషాల వ్యవధిలోనే బసు టికెట్లను బుక్ చేసుకోవచ్చు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు తీపికబురు చెప్పింది.. ఏపీఎస్ఆర్టీసీ బస్సుల టికెట్లను వాట్సాప్ (మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్) ద్వారా బుక్ చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు ఆర్టీసీ యాప్, వెబ్‌సైట్, రిజర్వేషన్ కౌంటర్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకుంటున్నారు.. కానీ ఇకపై వాట్సాప్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చు. ప్రయాణికులు వాట్సాప్ ద్వారా చాలా సులభంగా ఈ టికెట్లను బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ మేరకు ఏపీఎస్ఆర్టీసీ ట్వీట్ చేసింది.. ప్రయాణికులు వాట్సాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో టికెట్లను వాట్సాప్ ద్వారా ఎలా బుక్ చేసుకోవాలో చెబుతూ వివరాలు కూడా ప్రస్తావించారు.ప్రయాణికులు 9552300009 నంబర్‌ను సేవ్ చేసుకోవాలి.. అనంతరం ఆ నంబర్‌కు వాట్సాప్‌లో ఊఎ మెసేజ్ పంపాలి. అప్పుడు కొన్ని ఆప్షన్స్ వస్తాయి.. అందులో అష్ట్రనీనీబవ ౯ావతీలతిఇ఼వ ను ఎంచుకోవాలి. ంఖూఖీఅ ౯ావతీలతిఇ఼వబ ఆప్షన్‌ను ఎంచుకుని..టిక్కెట్ బుకింగ్ ను ఎంపిక చేసుకుకోవాలి. అక్కడ ప్రయాణానికి సంబంధించిన వివరాలు (ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలో) సమాచారం ఎంటర్ చేయాలి.

అనంతరం ఆన్‌లైన్ పేమెంట్ చేస్తే టికెట్ బుక్ అవుతుంది.. అనంతరం వాట్సాప్‌కు టికెట్ మెసేజ్ కూడా వస్తుంది. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.వాట్సాప్ ద్వారా ఆర్టీసీ బస్ టికెట్లను బుక్ చేసుకోవచ్చని ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు బస్ స్టేషన్లు, రిజర్వేషన్ కౌంటర్లు, ఎంక్వైరీ కౌంటర్లు, బస్ స్టేషన్లతో పాటుగా అవసరమైన చోట స్టిక్కర్లు, బ్యానర్లు ప్రదర్శించనున్నారు. బస్సుల్లో కూడా స్టిక్కర్లు అంటించి వాట్సాప్ నంబర్ 9552300009 (మన మిత్ర) ద్వారా ఆర్టీసీ బస్సు టికెట్లు బుక్ చేసుకోవచ్చని ప్రచారం కల్పించనున్నారు. ఇంగ్లీష్, తెలుగు భాషలలో వాట్సాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. సంక్రాంతి సమయం కావడంతో ఎక్కువమంది ప్రయాణికులు వాట్సాప్ ద్వారా బస్ టికెట్లను బుక్ చేసుకునేలా ఆర్టీసీ అవగాహన కల్పిస్తోంది. మొత్తానికి ఆర్టీసీ బస్ టికెట్లు బుక్ చేసుకునే సేవలు కూడా వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చాయి.

# బుల్లెట్ ట్రైన్ పై అప్ డేట్...



**తిరుపతి,తెలంగాణ దిశ :** ఏపీ మీదుగా హైస్పీడ్ బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం కసరత్తు జరుగుతోంది. హైదరాబాద్ - బెంగళూరు మార్గంలో బుల్లెట్ రైలు నడపాలనే ఆలోచనలో కేంద్రం ఉంది. అందులో భాగంగా ఈ మార్గంలో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో మంగళవారం భూ పరీక్షలు నిర్వహించారు. ప్రతిపాదిత బుల్లెట్ రైల్వే లైన్ అనంతపురం జిల్లా మీదుగా వెళ్లే అవకాశం ఉండటంతో.. నిపుణులు పలుచోట్ల మట్టిని సేకరించి.. పరీక్షలు నిర్వహించారు ఆంధ్రప్రదేశ్‌లో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు దిశగా కసరత్తు జరుగుతోంది. ఏపీలో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. దక్షిణాదిలో పెద్ద నగరాలైన హైదరాబాద్ - బెంగళూరు, అలాగే హైదరాబాద్ - చెన్నై నగరాల మధ్య బుల్లెట్ రైలు నడపాలని కేంద్రం భావిస్తోంది. అందుకు అనుగుణంగా ఈ మార్గాల్లో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. హైదరాబాద్ - బెంగళూరు బుల్లెట్ రైల్వే లైన్ ఏపీలోని అనంతపురం జిల్లా మీదుగా వెళ్తుంది. అలాగే హైదరాబాద్ - చెన్నై బుల్లెట్ రైల్వే లైన్ గుంటూరు జిల్లా మీదుగా వెళ్లేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - బెంగళూరు హైస్పీడ్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం అధికారులు కసరత్తు మొదలెట్టారుఅందులో భాగంగా అనంతపురం జిల్లాలో పరీక్షలు నిర్వహించారు. హైస్పీడ్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం భూసామర్థ్యాన్ని నిర్ధారించేందుకు అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రోజున మట్టి పరీక్షలు చేశారు. అనంతపురం రూరల్ మండలం, బుక్కరాయసముద్రం మండలంలోని కొన్ని గ్రామాలతో పాటుగా, సిద్దరాంపురం పరిసరాల్లో నిపుణుల బృందం మట్టి పరీక్షలు నిర్వహించింది. 40 పాయింట్ల వద్ద నుంచి మట్టి నమూనాలను సేకరించినట్లు సమాచారం.మరోవైపు దక్షిణాదిలోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమరావతిలను అనుసంధానం చేస్తూ బుల్లెట్ రైలు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు గత కొంతకాలంగా కేంద్రానికి ప్రతిపాదిస్తున్నారు. ఈ బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం సర్వే కూడా మొదలైందని ఇటీవల సీఎం చంద్రబాబు వెల్లడించారు. విశాఖపట్నంలో జరిగిన ఇండియా ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్ 2025లో భాగంగా చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. త్వరలోనే దక్షిణ భారతదేశానికి కూడా బుల్లె?ట్ రైలు వస్తుందని చంద్రబాబు ఈ సందర్భంగా వెల్లడించారు. సర్వే కూడా పూర్తైందని.. హైదరాబాద్, చెన్నై, అమరావతి, బెంగళూరును కలుపుతూ దీనిని ఏర్పాటు చేస్తారని చంద్రబాబు చెప్పుకొచ్చారు.ఈ నాలుగునగరాల జనాభా కోట్లల్లో ఉందన్న చంద్రబాబు.. వీటిని అనుసంధానం చేస్తే ప్రపంచంలోనే అతిపెద్ద క్లస్టర్‌గా, అతిపెద్ద మార్కెట్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే బుల్లెట్ రైలు వస్తే దక్షిణాదిప్రాంత అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు మన దేశంలో తొలి బుల్లెట్ రైలును ముంబయి-అహ్మదాబాద్ మధ్య ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే దక్షిణాది లోనూ బుల్లెట్‌రైలు ఏర్పాటు చేస్తే.. నాలుగు ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గుతుందని... వాణిజ్యం, వ్యాపారం. వర్తకం, సాంస్కృతిక, పర్యాట కంగా నాలుగు ప్రాంతాల మధ్య సంబంధాలు మరింత బలోపేతమ వుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

# ఎమ్మెల్యేలు పనితీరు పై నెగిటివ్ ఉందా

**విజయవాడ,తెలంగాణ దిశ :** ప్రభుత్వ అధినేత తీసుకునే నిర్ణయాలు కొంత వరకే పనిచేస్తాయి. కానీ ఎమ్మెల్యేల పనితీరు మాత్రం తీవ్రంగా ప్రభావం చూపుతాయి. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను మాత్రమే చూస్తారు. ఇప్పుడు కూటమి పార్టీలకు కూడా ఇదే తలనొప్పిగా మారింది. 164 స్థానాల్లో కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీలు గెలిచాయి. అది మొన్నటి ఎన్నికల్లో వరంగా కనిపించినా రానున్న ఎన్నికల్లో శాపంగా మారనున్నాయి. ఎందుకంటే ఖచ్చితంగా లోకల్ ఎమ్మెల్యేలపై ప్రతికూలత ఉంటుందన్నది వాస్తవం. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారు అన్ని సమస్యలను పరిష్కరించలేరు. అదేసమయంలో అనేక కొత్త సమస్యలు వచ్చిపడతాయి. వాటిని పరిష్కరించుకోవాలంటే ప్రభుత్వం నుంచి నిధులు అందడం లేదుగతంలో సంక్షేమ పథకాలు తక్కువగా.. అభివృద్ధి పనులకు ఎక్కువగా నిధులు వినియోగించేవారు. కానీ 2019 నుంచి ఆ పరిస్థితి మారింది. నాడు జగన్ ప్రభుత్వమైనా, నేడు కూటమి ప్రభుత్వమైనా సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది. అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించలేకపోతుంది. మరొకవైపు కూటమి ప్రభుత్వానికి రాజధాని అమరావతి ప్రధానంగా మారింది. దీంతో నిధులు, తీసుకు వచ్చిన అప్పులు రాజధాని అమరావతిలోనే కుమ్మరిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సయితం అమరావతికి తీసుకు వచ్చిన రుణాలను వేరే వాటికి ఉపయోగించలేమని, అలాగే తీసుకున్న అప్పులను కూడా కొన్నింటికే పరిమితం చేస్తామని పదే పదే చెబుతున్నారు.మరొకవైపు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పనులు జరగకపోవడంతో పాటు మద్యం, ఇసుక వంటి వాటిల్లో వేలుకాదు.. ఏకంగా చేతులే పెట్టేశారు. అదీ కూటమికి ఇబ్బందికరంగా మారింది. 164 మంది కూటమి ఎమ్మెల్యేల్లో అత్యంత తక్కువగా అంటే దాదాపు నలభై మంది ఎమ్మెల్యేలు మాత్రమే నిధులు ఎలాగోలా తెచ్చుకుని తమ నియోజకవర్గాల్లో సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. స్థానాల్లో ఎమ్మెల్యేలు మంత్రుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు. దీంతో ఇటు ఎమ్మెల్యేల అక్రమాలు, అవినీతి మరొకవైపు నియోజకవర్గాల్లో సమస్యలు పేరుకుపోవడం కూటమి పార్టీకి మైనస్ గా మారింది.

# భూసేకరణ ఇబ్బందులతో నిలిచిన ప్రాజెక్టులు..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ప్రాజెక్టులను ప్రతిపాదించాలి? భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయాలి? ఆ తర్వాత టెండర్లు ఖరారు చేయాలి? కానీ కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టులకు భూములు లేకుండానే, టెండర్లు ఖరారు చేయడం ఆనవాయితీగా మారింది. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో చేస్తున్న హడావుడి మాత్రం అంచనాలకు మించిపోతున్నది. ఇప్పటివరకు ప్రతిపాదించిన ప్రాజెక్టులు కాగితాలు దాటకముందే, అనుమతులు, డిజైన్లు ఖరారు చేసి, టెండర్లు ఆహ్వానించి కాంట్రాక్టర్లకు పనులన్నీ కట్టబెట్టడం వరకు చకచకా సాగిపోతున్నాయి. ఆ తర్వాత భూసేకరణలో బాధితులు చెప్పే అభ్యంతరాలతో ప్రాజెక్టులు ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి.

**కోర్టులను ఆశ్రయించి, వందలాది కేసులు..:** హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ఈ రెండు కీలక ప్రాజెక్టుల విషయంలో వందలాది మంది కోర్టులను ఆశ్రయించి, ప్రాజెక్టులకు భూములు ఇచ్చే అంశంలో వెనుకడుగు వేస్తున్నారు. ప్రభుత్వ ఒత్తిడితో మాత్రం హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించడం, వాటిని ఖరారు చేసి కంపెనీలకు కట్టబెట్టడం సర్వసాధారణంగా మారింది. ప్రాజెక్టులకు అవసరమైన భూములు లేకుండానే ప్రాజెక్టులకు టెండర్లను పిలిచి జనాలను మభ్యపెడుతుందే తప్ప.. ప్రతిపాదనల్లో ఎలాంటి పురోగతి ఉండటం లేదని రావిర్యాల గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్-1 విషయంలోనే తేటతెల్లమైంది. ఈ ప్రాజెక్టు కోసం వందలాది ఎకరాల పంట పొలాలను లక్ష్యంగా చేసుకుని భూసేకరణ ప్రక్రియ మొదలు పెట్టింది.అదే సమయంలోనే టెండర్లు ఖరారు చేసి ఓ వివాదాస్పద కంపెనీకి పనులు కూడా అప్పగించింది. కానీ ఇప్పటికీ ఈ ప్రాజెక్టుపై హైకోర్టులో వాదనలను బాధితులు వినిపిస్తూనే ఉన్నారు. ఇక ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు అంశంలో ఏకంగా 1000 మంది ప్రాజెక్టుకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించి, వారి ఆస్తులకు రక్షణ పొందుతున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం మరోసారి టెండర్లు ఖరారు చేసి, ఓ కంపెనీకి కట్టబెట్టే పనిలో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలోఫైనాన్షియల్, టెక్నికల్ బిడ్డింగ్‌లను కొలిక్కి తీసుకు రానున్నా రు. ఇలా ప్రాజెక్టుల విషయంలో టెండర్లతో బాధితులను ఆందోళనకు గురి చేస్తోంది. కోకాపేట నుంచి పరిగి వరకు నిర్మించే గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలోనూ హెచ్ఎండీఏకు రైతుల నుంచి తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లతో ఒరిగేదేమీ లేదని చెబుతున్నా? అభ్యంతరాలను స్వీకరిస్తున్నా మని చెప్పి? టెండర్లు ఆహ్వానించే పనిలో అధికారులు ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే శామీర్‌పేట-జేబీఎస్, ఎగ్జిట్ నంబర్..13 నుంచి ఫ్యూచర్ సిటీ వరకు, కోకాపేట నుంచి పరిగి మండలం చిట్యాల వరకు గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లను వేలకోట్ల రూపాయల అంచనాతో నిర్మించేందు కు ప్రతిపాదించింది.




## అయోమయంలో వైసీపీ..

# చిక్కుల్లో జగన్!

**గుంటూరు,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత సున్నితమైన, కీలక మైన అమరావతి విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యూహాత్మక తప్పిదం చేసిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. 2019–24 మధ్య మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి, ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకున్న తర్వాత కూడా ఆ పార్టీ తన పంథాను మార్చుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. తాజాగా లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే ఏపీ పునర్విభ జన సవరణ బిల్లు–2026 ఆమోదం పొందిన వేళ.. జగన్ మోహన్ రెడ్డి తెరపైకి తెచ్చిన మావిగన్ అనే కొత్త ప్రతిపాదన ఆ పార్టీని మరింత రాజకీయ రక్షణలో పడేసింది.మచిలీ పట్నం, విజయవాడ, గుంటూరులను కలిపి మావిగన్ అనే గ్రోత్ కారిడార్‌ను రాజధానిగా జగన్ ప్రతిపాదించడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. అయితే, పార్లమెంట్ సాక్షిగా అమరావతికి శాసనపరమైన గుర్తింపు దక్కిన ఈ తరుణంలో ఇలాంటి ప్రతిపాదన లు చేయడం చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం లాంటిదేనని విశ్లేషకులు అభిప్రాయపడుతు న్నారు. అమరావతి ఇప్పుడు కేవలం ఒక రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మాత్రమే కాదు, అది పార్లమెంట్ ఆమోదించిన చట్టం. జగన్ భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా తన వ్యక్తిగత కార్యాలయాలను ఎక్కడైనా పెట్టుకోవచ్చు కానీ, రాజధానిని తరలించడం అనేది ఇప్పుడు అసాధ్యమైన ప్రక్రియగా మారింది.రాజధాని విషయంలో వైసీపీ అనుసరిస్తున్న దోబూ చులాట ఆ పార్టీ క్యాడర్‌ను కూడా గందరగోళానికి గురిచేస్తోంది. ఒకవైపు అమరావతికి తాము వ్యతిరేకం కాదని చెబుతూనే, మరోవైపు పార్లమెంట్‌లో బిల్లును వ్యతిరేకించి వాకౌట్ చేయడం ద్వారా తమ ద్వంద్వ వైఖరిని బయటపెట్టుకున్నారు. ఈ సమయం లో అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, కేవలం అక్కడ జరుగుతున్నట్లుగా తాము భావిస్తున్న అవినీతి పై మాత్రమే పోరాటం చేసి ఉంటే వైసీపీకి రాజకీయంగా మైలేజీ దక్కేది. కానీ, ఇప్పుడు మావిగన్ వంటి కొత్త పేర్లతో గందరగోళం సృష్టించడం వల్ల ప్రజల్లో ఆ పార్టీ విశ్వస నీయత మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది.అమరావతిని స్మశానంఅని, గ్రాఫిక్స్ అని ఎద్దేవా చేసిన నేతలే, ఇప్పుడు రాజధాని హోదా కల్పించడాన్ని తప్పుపడుతున్నారు. సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు వంటి వారు అన్నీ అమరావతికే చేస్తే మేము అడుక్కుతినాలా? అని చేస్తున్న వ్యాఖ్యలు ప్రాంతీయ విద్వేషా లను రేకెత్తించేలా ఉన్నాయి. ఇలాంటి వ్యాఖ్యలను కట్టడి చేయకుం డా, జగన్ కూడా అదే బాటలో ప్రయాణించడం ఆయన రాజకీయ భవిష్యత్తుకే ముప్పు తెచ్చేలా ఉంది. అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ముద్ర ఇప్పటికే పడటంతో, మావిగన్ ప్రతిపాదన ఆ ముద్రను మరింత బలపరు స్తోంది. రాజకీయాల్లో టైమింగ్ చాలా ముఖ్యం. కేంద్రం అమరావ తికి నిధులు ఇవ్వడమే కాకుండా చట్టబద్ధత కూడా కల్పిస్తున్నప్పుడు, దానికి క్రెడిట్ రాకుండా చూడటం లేదా ఆ క్రెడిట్‌లో భాగస్వామ్యం కావడం విజ్ఞత అనిపించుకుంటుంది. కానీ వైసీపీ వ్యూహకర్తలు జగన్ చేత చట్టాన్ని సవరించలేరా అనే వ్యాఖ్యలు చేయించడం ద్వారా తనను తాను కొట్టుకున్నట్లుగా, కేవలంపంతం కోసమే రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిలబడు తున్నామనే అభిప్రాయం ప్రజల్లో కలిగేలా ఈ మావిగన్ రాజకీయం సాగుతోందన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

# అమరావతిపై పరస్పర విరుద్ధ ప్రకటనలు

## జగన్ మానసిక పరిస్థితిపై ఆందోళన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శలు



**విశాఖపట్నం,తెలంగాణ దిశ :** అమరావతిపై జగన్ మాట్లాడిన మాటలు చూస్తే ఆయన మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్ధమవుతోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అమరావతిపై జగన్‌లా ఇన్ని ప్రకటనలు చేసిన వ్యక్తి ప్రపంచంలో మరెవరూ ఉండరంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. మతిస్థిమితలం లేని వ్యక్తిలా ఆయన మాటలు ఉన్నాయని అన్నారు. పరస్పర విరుద్ధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో అమరావతి రాజధాని బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు . ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వివిధ సందర్భాల్లో రాజధాని గురించి మాట్లాడిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే విడుదల చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా అమరావతిని అంగీకరించారని.. గెలిచిన తర్వాత మూడు రాజధానులు అన్నారని గంటా శ్రీనివాస్ తెలిపారు. అమరావతి తీర్మానంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి కూడా హాజరు కాలేదన్నారు. పార్లమెంట్‌లో అమరావతికి వ్యతిరేకంగా ఉన్న ఏకైక పార్టీ వైసీపీ అని తెలిపారు. మొన్నటి వరకు ఉత్తరాంధ్ర అన్న జగన్.. ఇప్పుడు మావిగన్ అని అంటున్నారని అన్నారు. మాజీ సీఎంకు ఏ అంశంపైనా ఒక స్థిరమైన అభిప్రాయం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. వైసీపీకి 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు తీర్పు ఇచ్చినా జగన్ మారడం లేదన్నారు ఎమ్మెల్యే. అమరావతి కలల రాజధానిని సాధించుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అమరావతి ప్రజలను ఎన్ని ఇబ్బందులు పెట్టిందో అంతా చూశారన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో జగన్ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదపలేరని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# జిల్లాలో జనగణన పనులు సమగ్రంగా చేపట్టాలి : కలెక్టర్ అంకిత్





భద్రాద్రి బ్యూరో జిల్లాలో జాతీయ జనగణన కార్యక్రమాన్ని సమగ్రంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియలో ప్రతి ఇంటిని కవర్ చేస్తూ, ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితమైన డేటా సేకరణ జరగాలని ఆయన అన్నారు . జాతీయ జనగణన కార్యక్రమం భాగంగా జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఫీల్డ్ ట్రైనర్స్‌కు మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించ బడినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహి ంచబడగా, ఫీల్డ్ స్థాయిలో పని చేసే సిబ్బందికి అవసరమైన అన్ని అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్స్‌గా ఎన్. శివరామకృష్ణ, డాక్టర్ పి. సుస్మిత రజిని పాల్గొని, మొత్తం 34 మంది ఫీల్డ్ ట్రైనీస్‌కు జనగణన నిర్వహణ విధానం, హౌస్ సెన్సెస్, డేటా సేకరణలో పాటించాల్సిన జాగ్రత్తలు, డిజిటల్ పద్ధతుల వినియోగం తదితర అంశాలపై విపులంగా శిక్షణ అందించా రు. శిక్షణలో భాగంగా మూడవ రోజు పాలకోయ తండా ప్రాంతంలో ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. ఫీల్డ్ ట్రైనీస్‌ను అవుట్ ఫీల్డ్‌కు తీసుకెళ్లి, ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించే విధానాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా మొదటి ఇంటిలో హౌస్ సెన్సెస్ కార్యక్రమాన్ని కలెక్టర్ అంకిత్ సమక్షంలో నిర్వహించారు. ఈ డెమో ద్వారా ఫీల్డ్ ట్రైనీస్‌కు ప్రత్యక్ష అనుభవం లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణనలో సేకరించే సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఎంతో కీలకమని అన్నారు. అందువల్ల ప్రతి వివరాన్ని శ్రద్ధగా నమోదు చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారికి అవసరమైన సమాచారం అందిస్తూ డేటా సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ జిల్లా అధికార సిబ్బంది, సి.పి.ఓ. సంజీవరావు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణా కార్యక్రమం కొనసాగింది.

# టీఆర్ఎస్ పేరు వాడేసుకుంటారా?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్రసమితి).. ఒకప్పుడు గ్రామ గ్రామాన నినదించిన పేరు.. వినిపించిన పేరు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు.. కూడా టీఆర్ ఎస్ తెలంగాణ పల్లె నుంచి పట్నం వరకు ప్రజల నరాల్లో జీర్ణించుకుపోయింది. పూర్తిస్థాయి పేరు పలకడం రాని వారు కూడా 'టీఆర్ఎస్' జపం చేసిన రోజులు ఇంకా గుర్తుండే ఉన్నాయి. టీఆర్ ఎస్ అధినేత కేసీఆర్.. అధికారంలోకి వచ్చిన ఏడు సంవత్సరాల వరకు టీఆర్ ఎస్ పార్టీనే ఉంది. ఆ తర్వాత.. దానిని బీఆర్ ఎస్‌గా మార్పు చేశారు. .. ఇప్పుడు ఈ 'టీఆర్ ఎస్' పేరును వినియోగించుకునే దిశగా కేసీఆర్ తనయ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అడుగులు వేస్తున్నారా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. ప్రస్తుతం టీఆర్ ఎస్ ఖాళీగా ఉందని.. దానిని ఎవరూ వినియోగించుకోవడం లేదని.. దీనిని ఎవరైనా వినియోగించుకునే సౌకర్యం ఉందని కవిత వ్యాఖ్యానించారు. దీనిని బట్టి.. ఆమెస్థాపించ బోయే కొత్త పార్టీకి ఈ పేరు పెట్టినా ఆశ్చర్యంలేదన్న వాదన వినిపిస్తోంది వాస్తవానికి కొన్ని రోజుల కిందట.. కవిత.. తన పార్టీ పేరును తెలంగాణ 'జాగృతి'గానే పేర్కొన్నారు. ఈ పేరునే కేంద్ర ఎన్నికల సంఘంలో నమోదు చేసేందుకు ఇచ్చినట్టు ప్రచారం కూడాఉంది. కానీ, ఇంత లోనే ఆమె తనదైన శైలిలో వ్యూహం మార్చినట్టు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి కంటే.. 'టీఆర్ఎస్' పేరు ఇప్పటికే ప్రజలకు చేరువైన నేపథ్యంలో ప్రజల నాలుకలపై ఒకప్పుడు పెద్ద ఎత్తున కదలాడిన పేరు కూడా కావడంతో ఆ పేరునే ఆమె ఓన్ చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ విషయాన్ని నర్మగర్భంగా చెప్పుకొచ్చిన కవిత.. "పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తా" అని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ పేరు ఫ్రీ అయిందని అన్నారు. ఈ పేరును ఇప్పుడు ఎవరైనా వాడుకోవచ్చని వ్యాఖ్యానించారు. అయితే.. తాను తీసుకుంటున్నట్టుగా ఆమె స్పష్టం చేయలేదు. ఇదిలావుంటే.. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని కవిత వెల్లడించారు. తాము ఏ బీహార్‌కు చెందిన వ్యక్తుల సలహాలను తీసుకునేది లేదన్నారు. సో.. దీనిని బట్టి కవిత పార్టీ 'టీఆర్ ఎస్' అయ్యే అవకాశం ఉందన్న చర్చకు తెరలేచింది.

# ఒరాకిల్ లో ఏం జరుగుతోంది?




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** టెక్ దిగ్గజం ఒరాకిల్ ఒకేసారి 30 వేల మంది ఉద్యోగులపై వేటు వేయడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఉచకోత రాబోయే రోజుల్లోనూ కొనసాగనున్నాయని సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామం ఇప్పుడు భారతదేశంలోని టెక్ హబ్‌లలో కొత్త భయాందోళనలు రేకెత్తిస్తోంది. కంపెనీలు అనుసరిస్తున్న లేఆఫ్ ల కారణంగా ఐటీ నిపుణులు తమ భారీ పెట్టుబడులను పున:సమీక్షించుకుంటున్నారని తద్వారా రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం పడబోతున్నట్లు బిజినెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.రెండు దశాబ్దాలుగా భారత్‌లో నెక్స్ట్ లెవల్ గా దూసుకుపోయిన భారత ఐటీ సెక్టార్ వృద్ధి వేగంగా ఇటీవల నెలకొన్న పరిణామలతో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఒరాకిల్ ఇండియా తరహా పరిణామాలు ఇతర కంపెనీల్లోనూ కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే దేశంలోని ఐటీ నగరాలపై తీవ్ర ప్రభావం పడబోతున్నట్లు తెలుస్తోంది. ఐటీ రంగంలో వచ్చిన ఆదాయం ప్రధానంగా బెంగళూరు, హైదరాబాద్ , పూణే, ఎన్ సీఆర్ నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం బలపడటాని వెన్నెముకగా నిలిచింది. కానీ తాజా లే ఆఫ్ లతో ఈ పరిస్థితులు తారుమారు అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో భారీ ధరలు పెట్టి ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.. ఇప్పుడు తమ ఈఎంఐలను చెల్లించేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇక ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారు రేపు తమకు కూడా ఇదే పరిస్థితి రావొచ్చనే భయంతో తమ నిర్ణయాలను వాయిదా వేసుకునే అవకాశాలు ఉండనుంది.ఐటీ రంగంలో వస్తున్న పెనుమార్పులు ఇప్పుడు సామాన్యుడి సొంతింటి కలపై కోలుకోలేని దెబ్బ తీస్తుండగా ఏఐ ప్రభావం ఐటీ రంగాన్ని మరింత ఆందోళనలోకి నెట్టుతోంది. ఆటోమేషన్ వల్ల ఐటీ కంపెనీల రాబడిలో 2 నుంచి 3 శాతం తగ్గుదల ఉండవచ్చని ఐసీఐసీఐ డైరెక్ట్ అంచనా వేసింది. 2026లో ఇప్పటివరకు నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 25 శాతం పడిపోయింది. గతంలో అమెరికా డెవలపర్ల కంటే భారతీయ డెవలపర్లు తక్కువ శాలరీలకే లభిస్తారనే ఆలోచనలతో ఐటీ కంపెనీలు నడిచాయి. కానీ ఇప్పుడు ఎఐ కోడింగ్ ఏజెంట్లు విద్యుత్ ఖర్చుతోనే పని పూర్తి చేస్తున్నాయి. దీనివల్ల టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి దిగ్గజాలకు ముప్పు పొంచి ఉందని 'సిట్రిని రీసెర్చ్' నివేదిక హెచ్చరించింది. దీంతో రాబోయే రోజుల్లో ఐటీ సెక్టార్ ఎలా ఉ ండబోతోంది? తద్వారా ఆ రంగంలోని ప్రభావం ఇతర రంగాలపై ఎలా పడబోతోంది అనేది ఉత్కంఠ రేపుతోంది.

# రాజ్యాంగేతర శక్తిగా ఐఏఎస్..

హైదరాబాద్, : సాధారణంగా మనం రాజకీయ నాయకులను అత్యంత శక్తివంతులైన వారిగా భావిస్తుంటాం.. వారు తలచుకుంటే ఏదైనా చేయగలరని అనుకుంటాం. కానీ రాజకీయ నాయకులను మించిపోతున్నారు నేటి కాలంలో అధికారులు. ముఖ్యంగా కొంతమంది బ్యూరో క్రాట్ లు సమాంతర వ్యవస్థను నడిపిస్తున్నారు. గతంలో ఇలా ఉండేది కాదు. ఇప్పుడు రాజకీయ నాయకులకు సంపాదన మీద విపరీతమైన యావ పుట్టింది కాబట్టి.. అక్రమ అర్జనకు అధికారుల అండ కావాలి కాబట్టి.. అటువంటి అధికారులు తమకు తాముగా స్వీయ శక్తిని పెంచుకొని వ్యవస్థలకు మించి ఎదుగుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఓ మంత్రి కుటుంబ సభ్యులు హైదరాబాద్ నగర శివారులో ఓ గ్రామంలో భూముల కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఆ భూములను ఇవ్వకపోతే వారిని అంతం చేస్తారని బెదిరించినట్టు వార్తలు వినిపించాయి. వారికి ప్రతిపక్ష పార్టీ అండగా నిలిచింది. వారు ఇచ్చిన ఆధారాలను విలేకరుల ఎదుట ప్రదర్శించింది. ఆ మంత్రి కుమారుడు.. బంధువులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.. ఈ నేపథ్యంలో ఆ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకుడు ఓ ఐఏఎస్ అధికారి గురించి ప్రధానంగా ప్రస్తావించారు. ఆ అధికారి మంత్రి కుటుంబ సభ్యులతో మిలాఖత్ అయ్యారని.. ఆయన అండదండలతోనే మంత్రి కుటుంబ సభ్యులు రెచ్చిపోతున్నారని ఆ ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు.. ఆ అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆ అధికారి పేరును పదేపదే ప్రస్తావించిన నేపథ్యంలో.. ఆయన గురించి విస్తృతంగా చర్చ జరుగుతుంది. ఇప్పటి అధికార పార్టీలోనే కాదు.. గత అధికార పార్టీలోనూ ఆ సీనియర్ ఐఏఎస్ అధికారి ముఖ్య భూమిక పోషించారు. నాడు ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులో ఆ ఐఏఎస్ అధికారి తనకు అనుకూలంగా నిబంధనలు మార్చారు. భూములను మొత్తం నచ్చిన వాళ్లకు కట్టబెట్టారు. ఏళ్ల తరబడి ఆయన అదే పోస్టులో ఉన్నారు.. ఒక సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసుకొని.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం మాత్రమే కాదు.. సొంత ఆస్తులను విపరీతంగా పెంచుకున్నారు.. అప్పట్లో ఓ రాజకీయ పార్టీకి ఆ అధికారి భారీగా విరాళం కూడా ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి.నాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ అధికారి రెవెన్యూ విభాగంలో కింగ్ పిన్ మాదిరిగా వ్యవహరించాడు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఆయన అదే శాఖలో కొనసాగుతున్నాడు. అంతేకాదు అంతకుమించి అనే స్థాయిలో దోపిడికి పాల్పడుతున్నాడు. సదరు అధికారి గురించి ఇటీవల ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన కీలక నాయకుడు చేసిన ఆరోపణలు నూటికి నూరు శాతం నిజం. కాకపోతే, ఆ ప్రతిపక్ష నాయకుడు తెలంగాణ ప్రభుత్వంలో షాడో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా..ఆ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నాడు ఆ అధికారితో సదరు కీలక ప్రతిపక్ష నాయకుడు చెట్టా పట్టాలు వేసుకొని తిరిగాడు.

# కుమైట్ చమురు-శుద్ధి కర్మాగారంపై దాడి

## డ్రోన్లతో విరుచుకు పడ్డ ఇరాన్

## పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ ప్రకటన

కువైట్ సిటీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. కువైట్ లోని ప్రధాన చమురుశుద్ధి కర్మాగారం మినా అల్–అహ్మదిపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో ఆ ప్రాంతంలో భారీఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది. మంటలు అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొంది. ఈ దాడిలో ఎటువం టి ప్రాణనష్టం సంభవించలేదని తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో మినా అల్–అహ్మది ఒకటి. కువైట్ చమురు ఉత్పత్తికి ఇది చాలా కీలకం. మినా అల్–అహ్మది కర్మాగారం నుంచి రోజుకు 3,46,000 బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తారు. దాదాపు లక్షల బ్యారెళ్ల మేర డీజిల్, ఇతర శుద్ధి చేసిన ఇంధనాలను ఆసియా, యూరప్‌లోని మార్కెట్లకు ఎగుమతి చేస్తూ.. ప్రభుత్వానికి కీలకమైన ఆదాయ వనరుగా నిలుస్తోంది. ఈ కర్మాగారం లేకపోతే అక్కడ ఉత్పత్తి అయ్యే చమురును శుద్ధి చేయలేక బావులను మూసివేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇక్కడినుంచి భారత్‌తో సహా ఇతర ప్రపంచదేశాలు చమురు దిగుమతి చేసుకుంటాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం భారత్.. కువైట్ నుంచి చమురు దిగుమతులు నిలిపివేసింది.

జాతీయ ఆయిల్ కంపెనీపై డ్రోన్ దాడి జరిగినట్లు కువైట్ న్యూస్ ఏజన్సీ పేర్కొంది. దీంతో పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని తెలిపింది. ఉదయం మినా అల్–అహ్మదీ రిఫైనరీ లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగిందని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ (కెపిసి) మీడియాకు తెలిపింది. ఫలితంగా పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని, అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని పేర్కొంది. గల్ఫ్ భూభాగంపైకి ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను వైమానిక రక్షణవ్యవస్థ సమర్థవంతంగా అడ్డుకుంటుందని కువైట్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా సైరన్‌లు మోగుతున్నాయని బహ్రెయిన్ అంతర్గత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలు వెల్లడించేందుకు నిరాకరించింది.

# కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లతో పొంచి ఉన్న ప్రమాదం!

**తుర్కయంజాల్,తెలంగాణ దిశ :** జీ హెచ్ ఎం సి ఆదిభట్ల సర్కిల్ పరిధిలో ఎక్కడ చూసినా కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ లే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజల ప్రాణాలకు పెను ముప్పుగా మారింది. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ల వద్ద హెచ్చరిక బోర్డులు, చుట్టూ కంచె ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నివాస ప్రాంతాలు, స్కూల్స్, కాలనీల మధ్యలో భద్రతా చర్యలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని మన్నెగూడ కాలనీ రోడ్ నెంబర్ 7 లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకర పరిస్థితుల్లో కనబడుతున్నాయి. అలాగే రోడ్ నెంబర్ 10 లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె, హెచ్చరిక బోర్డులు లేకుండా ప్రమాదకర పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ స్కూల్‌కు వచ్చే, వెళ్లే చిన్నారులు ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరగా వెళ్లాల్సి వస్తుండటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు. చిన్నపిల్లలు అవగాహన లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో ఆడుకోవడం, తాకే అవకాశం ఉండటంతో కాలనీవాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత మాత్రమే స్పందించే అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత ప్రమాదకర పరిస్థితి ఉన్నప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రత్యక్షంగా కనబడుతుంది. కూత వేటు దూరంలో ఇబ్రహీంపట్నం విద్యుత్ డివిజనల్ కార్యాలయం ఉన్నప్పటికీ విద్యుత్ అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికంగా విమర్శలకు దారితీస్తుంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేసి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఇరాన్ అశాంతికి బయటి శక్తుల ఆజ్యం




ఇరాన్ ఆధునిక చరిత్రలోనే అత్యంత తీవ్రమైన సంక్షోభాల్లో ఒకదాన్ని ఎదుర్కొంటోంది. ఆర్థిక కష్టాలపై ప్రారంభమైన నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించి, సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖామెనీ అధికారానికి నిరంతర సవాలుగా మారింది. హింస పెరుగుతున్న వేళ, ఉరిశిక్షల బెదిరింపులు, దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ నిలిపివేత, అలాగే ముఖ్యంగా అమెరికా వంటి విదేశీ శక్తుల జోక్యంఇరాన్ అంతర్గత కలకలిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. మానవ హక్కుల సంస్థలు పరిస్థితులు వేగంగా క్షీణిస్తున్నాయని హెచ్చరిస్తున్నాయి. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి అగెస్ కాలమార్డ్, నిరసనలను అణిచివేయడానికి "త్వరిత విచారణలు, యాదచ్ఛిక ఉరిశిక్షలు" మళ్లీ ఉపయోగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2022లో జరిగిన ఉమెన్, లైఫ్, ఫ్రీడం ఉద్యమం తరువాత చోటుచేసుకున్న సామూహిక ఉరిశిక్షలను ఆమె గుర్తు చేశారు. దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ బ్లాక్‌ఔట్ కారణంగా హత్యలు, అరెస్టుల నిజమైన పరిమా ణాన్ని నిర్ధారించడం అసాధ్యంగా మారింది. అశాంతి వ్యాప్తి మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఇరాన్‌లోని 31 ప్రావిన్సులన్నింటిలోనూ నిరసనలు చెలరేగాయి. 180కు పైగా నగరాల్లో వందలాది ప్రదర్శన లు నమోదయ్యాయి. ఇటీవలి వారాల్లో కనీసం 850 మంది మరణిం చారని, 2,300 మందికి పైగా అరెస్టయ్యారని హక్కుల సంఘాలు అంచనా వేస్తున్నాయి. బ్లాక్‌ఔట్ వల్ల కుటుంబాలు పరస్పరం సంబం ధాలు కోల్పోయాయి. ఇదంతా జరుగుతుండగానే భద్రతా బలగాలు తమ దమన చర్యలను మరింత కఠినతరం చేశాయి. తాజా నిరసనలకు కారణం ఆర్థిక పతనం. ఇరానియన్ రియాల్ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది. ద్రవ్యోల్బణం సుమారు 40 శాతానికి చేరింది. ఆహారం, ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. పెట్రోల్ ధరల పెంపు, చాలా వస్తువులపై సబ్సిడీ మారకపు రేట్ల రద్దు ఇవన్నీ అనేక కుటుంబాలను అంచుల దాకా నెట్టాయి. అయితే నిరసనలు త్వరలోనే ఆర్థిక అంశాలను దాటి, రాజకీయ దమనంపై ఉన్న కోపాన్ని ప్రతిబింబించాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘర్షణాత్మక ధోరణి అవలంభించారు. నిరసనలు కొనసాగించాలని ఇరానీయులను ప్రోత్సహిస్తూ, నిరసనకారులకు ఉరిశిక్షలు అమలు చేస్తే "తీవ్ర చర్యలు" తీసుకుంటామని తెహ్రాన్‌కు హెచ్చరించారు. ఇరాన్‌లో "గెలవాలి" అనేదే తన లక్ష్యమని ట్రంప్ చెప్పారు, వేగవంతమైన, బలప్రయోగాత్మక చర్యల సంకేతాలిచ్చారు. అయితే ఇవి మధ్యప్రాచ్యంపై అమెరికా దష్టిని తగ్గించాలని, ఇతర దేశాలపై రాజకీయ మార్పులు రుద్దకూడదని చెప్పిన కొద్ది వారాల క్రితమే విడుదలైన వాషింగ్టన్ జాతీయ భద్రతా వ్యూహానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. సెనేటర్ బెర్నీ శాండర్స్, అమెరికా సైనిక జోక్యం ఘోరమైన తప్పిదమని హెచ్చరిస్తూ, గత జోక్యాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. హింసాత్మక దమనాన్ని ఆపాలని, ఇంటర్నెట్‌ను పునరుద్ధరించాలని, స్వేచ్ఛాయుత ఎన్నికలకు మద్దతు ఇవ్వాలని వాషింగ్టన్ కోరాలని ఆయన అభిప్రాయం. బాహ్య ఒత్తిడి ముఖ్యంగా సైనిక బెదిరింపులు తాము సహాయపడాలనుకునే ప్రజలకే నష్టం చేస్తాయన్న విస్తత ఆందోళనను ఇది ప్రతిబింబిస్తుంది.

# పడిపోతున్న ఇరాన్ కరెన్సీ..



న్యూఢిల్లీ, ,: ఇరాన్ ఆర్థిక వ్యవస్థ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. ఆర్థిక సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతోంది. దేశ కరెన్సీ రియాల్ విలువ పతనం ఆగడం లేదు. దీంతో ప్రజలు పెరిగిన నిత్యావసర ధరతో ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు. ప్రస్తుతం ఒక డాలర్ విలువ ఇరాన్‌లో 14 లక్షల రియాల్‌కు చేరింది. దీంతో సామాన్యులు రోజువారీ అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి నెలకొంది. భారత రూపాయితో పోల్చితే, కేవలం రూ.90తో 14 లక్షల రియాల్స్ పొందవచ్చు. గత డిసెంబర్‌లో సెంట్రల్ బ్యాంక్ అధ్యక్షుడు మొహమ్మద్ రెజా ఫార్జిన్ రాజీనామా చేశారు. గత జూన్‌లో ఇజ్రాయిల్‌తోప్రారంభమైన యుద్ధం ఇరాన్ పతనాన్ని వేగవంతం చేసింది. అమెరికా యూక్లియర్ సైట్లపై దాడులు, ఐకేయరాష్ట్ర సమితి ఆంక్షలు ఆర్థికాన్ని కుంగదీశాయి. 2018లో ట్రంప్ పాలిసీతో జిల్లెడిన ఆయిల్ ఎగుమతులు, విదేశీ ముద్ర లభ్యతతగ్గడం సమస్యలనుమరింత తీవ్రతరం చేశాయి. 1979 విప్లవ సమయంలో డాలర్ విలువ 70 రియాల్స్‌కు సమానంగా ఉండేది. 2026 ప్రారంభంలో 14 లక్షలకు చేరింది. 40 ఏళ్లలో విలువ 20,000 రెట్లు పడిపోయింది. 2025లో మాత్రమే 45 శాతం క్షీణత. బంక్ డబ్బులు కరిగిపోతాయని భయపడి పౌరులు డాలర్లు, బంగారు కొనుగోళ్లకు దూకుతున్నారు. డిసెంబర్‌లో తెహ్రాన్ గ్రాండ్ బజార్ వ్యాపారులు ధరల పెరుగుదలతో ఇబ్బంది పడ్డారు. రియాల్ పతనంతో రుణాలు పెరిగి, విద్యార్థులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. జొమ్హౌరి అవెన్యూలో ప్రారంభమైన ఇది ఇప్పుడు అయతోల్లా అలీ ఖమేనీ నేతృత్వంలోని ఇస్లామిక్ రిపబ్లిక్‌పై పోరుగా మారింది. 2022లో మహ్సా అమినీ మరణం తర్వాతి అల్లర్లు ఇప్పటి అగ్నిపర్వతాన్ని పెంచాయి. ఇరాన్ సంక్షోభం భారత్‌పైనా ప్రభావం పడే అవకావం ఉంది. మన దేశం గతేడాది 1.24 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేసింది. 0.44 బిలియన్ డాలర్ల ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 1.68 బిలియన్ డాలర్లు. భారత కరెన్సీలో రూ.15 వేల కోట్లకుపైనే. ఆర్థిక సంక్షోభం కారణంగా ఎగుతులు నిలిచిపోయే ప్రమాదం ఉంది.

# సంక్షేమం సరే.. ప్రజాసమస్యలు సంగతేంటీ.?

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణలో ప్రస్తుతం సంక్షేమం వర్సెస్ అభివృద్ధి అనే అంశం హాట్ టాపిక్ గా మారుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన ఆరు గ్యారెంటీల అమలుకు పెద్దపీట వేసింది. 2025-26 బడ్జెట్‌లో ఏకంగా రూ. 56,000 కోట్లను కేవలం ఈ గ్యారెంటీల కోసమే కేటాయించడం ప్రభుత్వ ప్రాధాన్యతలను స్పష్టం చేస్తోంది. అయితే, ప్రజలను నేరుగా ఆకట్టు కునే నగదు బదిలీ, ఉచిత పథకాలపై పెడుతున్న దృష్టి, రాష్ట్ర భవిష్యత్తు కు కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనపై తగ్గిపోతోందనే విమర్శ లు వినిపిస్తున్నాయి. రోడ్ల మరమ్మతులు, మురుగునీటి పారుదల వంటి ప్రాథమిక పనులు కూడా నిధుల లేమితో అగిపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణం అవుతోంది. ముఖ్యంగా గతంలో ఆర్భాటంగా ప్రకటించి శంకుస్థాపనలు చేసిన పలు ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగో చరంగా మారింది. ఉదాహరణకు, ఓటూ రెండో దశ పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా ఇవ్వాల్సిన సుమారు రూ. 381 కోట్లు విడుదల చేయకపోవడంతో ఆ ప్రాజెక్టు పట్టాలెక్కడం లేదు. అదేవిధంగా, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధుల బకాయిలు పెరిగిపోవడం వల్ల పనులు మందగించాయి. కేవలం రైల్వేలే కాకుండా, సాగునీటి రంగంలో అత్యంత కీలకమైన దేవాదుల వంటి ప్రాజెక్టులు నిధుల కొరత కారణంగా 2025 నాటికి పూర్తి కావాల్సిన గడువును దాటి 2027కు వాయిదా పడ్డాయి. ప్రభుత్వ వ్యూహం ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, పేదలకు తక్షణ ఊరటనివ్వడం చుట్టూ తిరుగుతోంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి వంటి పథకాలు లబ్ధిదారులకు మేలు చేస్తున్నా.. దీర్ఘకాలికంగా ఆదాయాన్ని సృష్టించే మౌలిక సదుపాయాల కల్పన అటకెక్కడం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వ కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపా యల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో, కొత్త పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీనివల్ల గ్రామాలు, పట్టణాల్లో చిన్న చిన్న అభివృద్ధి పనులు సైతం నిలిచిపోయి, ప్రజలు రోజువారీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ , రీజినల్ రింగ్ రోడ్ వంటి భారీ ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో భూసేకరణ సవాళ్లు, నిధుల సమీకరణ పెద్ద అడ్డంకు లుగా మారాయి. ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం వంటి అత్యవసర ప్రాజెక్టుల విషయంలో శంకుస్థాపన చేసినా, అసలు పనులు ప్రారంభం కావడానికి నెలల తరబడి సమయం పడుతోంది. ఆరోగ్య, విద్యా రంగాల్లో మౌలిక వసతుల లేమిపై నిరసనలు వ్యక్తమవుతున్నా యి. ఆరు గ్యారెంటీల అమలు కోసం చేస్తున్న అప్పులు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే అవకాశం ఉండటంతో, భవిష్యత్తులో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం మరింత కష్టతరం కానుందిన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కేవలం సంక్షేమ పథకాలతోనే ఓటర్లను మెప్పించవచ్చని భావించడం ప్రభుత్వానికి రాజకీయంగా రిస్క్ తో కూడుకున్న వ్యవహారమే. ఎందుకంటే, ప్రజలు పథకాలతో పాటు మెరుగైన రోడ్లు, సాగునీరు, మౌలిక సదుపాయాలను కూడా కోరుకుం టారు. నిధులన్నీ పథకాలకే మళ్లిస్తూ, కంటికి కనిపించే అభివృద్ధిని విస్మరించడం వల్ల మధ్యతరగతి, పట్టణ ఓటర్లలో వ్యతిరేకత మొదలవుతోంది. సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య సరైన సమతుల్యత పాటించకపోతే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తెలంగాణలో కుల రాజకీయాలు సాధ్యమేనా..?

కరీంనగర్,: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ రెండు పడవలపై కాళ్లు పెట్టకూడదు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి తో అధికారంలోకి వచ్చిన పవన్ కల్యాణ్ తెలంగాణలోనూ పార్టీని విస్తరించాలని భావిస్తున్నట్లు కనపడుతుంది. ఇటీవల కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం పర్యటనలో భాగంగా ఒక రిసార్ట్ లో తెలంగాణ జనసేన నేతలు, కార్యకర్తలతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. అయితే పవన్ కల్యాణ్ ను అభిమానించే వారు తెలంగాణలో లేరని కాదు. అది సినిమా హీరోగానే అభిమానించే వాళ్లు. అంతే తప్ప రాజకీయంగా ఆయనను ఓన్ చేసుకునే వారు దాదాపుగా లేరనే చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు,తెలంగాణ పాలిటిక్స్ కు చాలా తేడా ఉంది. ఇక్కడ కుల రాజకీయాలు అస్సలు పనిచేయవు. అలాగే సెంటిమెంట్ బాగా పనిచేస్తుంది. గతంలో జరిగిన అనేక ఎన్నికలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. అందుకే వైసీపీ తెలంగాణలో దుకాణం మూసేసింది. తన పార్టీని ఆంధ్రప్రదేశ్ కు మాత్రమే పరిమితం చేసింది. అసలు జగన్ తెలంగాణ రాజకీయాల్లో వేలు కూడా పెట్టడం లేదు. ఇక కూటమిలో తన మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ కూడా దాదాపు అదే బాటలో పయనిస్తుంది. తెలంగాణలో టీడీపీ ఇంతవరకూ రాష్ట్ర కమిటీని కూడా ఏర్పాటు చేయలేదు. జగన్, చంద్రబాబును చూసినట్లుగానే పవన్ కల్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ వాసిగానే తెలంగాణ ప్రజలు చూస్తారు. అంతే తప్ప తండోపతండాలుగా వచ్చి ఓట్లు గుమ్మరించే సీన్ మాత్రం లేదనే చెప్పాలి. అందుకే ఆంధ్రప్రదేశ్ లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకుంటే మంచిది. పార్టీ పెట్టి ఇన్నేళ్లయినా ఆంధ్రప్రదేశ్ లోని అన్ని నియోజకవర్గాల్లో జనసేన లేదు. ఇది వాస్తవం. అలాంటిది తెలంగాణలో రాజకీయం చేసి చేతులు కాల్చు కోవడంతప్ప మిగిలేది ఏమీ ఉండదన్నకామెంట్స్ వినపడుతున్నా యి. బహుశబీజేపీతో పొత్తుపెట్టుకున్నప్పటికీ ఇక్కడపెద్దగా రాజకీ యంగా ఒరిగేది లేదు. వచ్చేది లేదు. అందుకే ముందు ఆంధ్రప్రదేశ్ లో పార్టీపై ఫోకస్ పెట్టి వచ్చే ఎన్నికల్లో మరిన్ని సీట్లు గెలిచి ముఖ్య మంత్రి పదవికి దగ్గర దారి ఏర్పరుచుకుంటే మంచిదన్న సూచనలు పవన్ కల్యాణ్ కు కొందరు సోషల్ మీడియా వేదికగా చెబుతున్నారు. మరి పవన్ చెవికి ఈ మాటలు ఎక్కుతాయో? లేదో? చూడాలి.

# యూపీఐ ద్వారా పీఎఫ్ విత్‌డ్రా!

## బ్యాంకు ఏటీఎంల ద్వారా నగదు ఉపసంహరణ ఏప్రిల్‌నాటికి అందుబాటులోకి




న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) చందాదారులు తమ ఈపీఎఫ్‌ను యూపీఐ పేమెంట్ గేట్‌వే ద్వారా నేరుగా తమ బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసుకునే అవకాశం ఏప్రిల్ నాటికి అందుబాటులోకి వస్తుంది. ఈపీఎఫ్‌లో కొంత నిష్పత్తిలో సొమ్మును మినహాయించి, అత్యధిక సొమ్ము ను చందాదారులకు అందుబా టులో ఉంచేందుకు, ఆ సొమ్మును యూపీఐ విధానంలో తమ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయడానికి వీలు కల్పించే ప్రాజెక్టును కార్మిక మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేస్తున్నది. ఈపీఎఫ్‌వోతో అనుసం ధానం చేసిన బ్యాంక్ ఖాతాకు బదిలీ చేయడానికి అందుబాటులో ఉన్న అర్హత గల ఈపీఎఫ్ బ్యాలన్స్‌ను చందాదారులు తెలుసుకోగలు గుతారు. అనుసంధానం చేసిన యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) పిన్‌ను ఉపయోగించి, లావాదేవీని పూర్తి చేయవచ్చు. దీని వల్ల ఈపీఎఫ్‌వో చందాదారుల బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ము సురక్షితంగా బదిలీ అవుతుంది. ఆ సొమ్మును బ్యాంకు ఏటీఎంల ద్వారా తీసుకోవచ్చు. ఈ విధానం సజావుగా అమలయ్యేందుకు సాఫ్ట్‌వేర్ సమస్యలను పరిష్క రించే ప్రయత్నంలో ఈపీఎఫ్‌వో ఉంది.

# భాగ్యనగరం.. వామ్మో.. కాలుష్యం...!



హైదరాబాద్,తెలంగాణ దిశ:పరిశ్రమలు నగరమంతటా చెల్లాచెదురుగా విస్తరించి ఉన్నాయి. ఇది వ్యవస్థీకృత పరిశ్రమల జోనింగ్ సూత్రాలను ఉల్లంఘిస్తోంది. నగర విస్తరణ సమయంలో శాస్త్రీయ విశ్లేషణలు, పౌర సంప్రదింపులు ఎక్కువగా లేకపోయాయి. ఒకప్పుడు హైదరా బాద్‌లో మూసారాంబాగ్ వంటి చారిత్రక 'బాగ్‌లు', అనేక చెరువులు ఉండేవి. కానీ అవి కనుమరుగవడం గాలి నాణ్యతపై నే రుగా ప్రభావం చూపింది. ప్రజా రవాణా ఇప్పటికీ విశ్వసనీయంగా లేకపోవడం, అం దుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు వ్యక్తిగత వాహనాలపై ఆధారపడాల్సి రావడం మరో ప్రధాన కారణం. 'హైదరాబాద్‌లో ఇప్పుడు ద్విచక్ర, త్రిచక్ర వాహనాల సాంద్రత అత్యధికంగా ఉంది. ఏటా లక్షల సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి, దీనివల్ల ఉద్గారాలు గణనీయం గా పెరుగుతున్నాయ'ని ఒక పౌరుడు తెలిపారు. ప్రణాళిక లేని పరిశ్రమల అభివృద్ధి, ముఖ్యంగా రసాయన, ఔషధ పరిశ్రమలు, కాలుష్య భారాన్ని మరింత పెంచుతూ హైదరాబాద్ గాలిని రసాయనపరంగా మరింత విషపూరితంగా మారుస్తున్నాయి. కాలుష్యానికి మరో ప్రధాన కారణం హైదరాబాద్‌లో శాస్త్రీయ పట్టణ ఘన వ్యర్థాల నిర్వహణ లేకపోవడమే. 'చెత్తను తరచుగా కాల్చడం లేదా రోడ్ల పక్కన పడేయడం జరుగుతోంది. భారీ చెత్త కొండలు ఏర్పడి, జవహర్‌నగర్ వంటి ప్రాంతాలు డంపింగ్ యార్డులుగా మారాయి. ఇది పౌరులూ, జీహెచ్ఎంసీ రెండింటికీ చెందిన వైఫల్యం' అని ఆయన వివరించారు. అత్యంత కీలకమైన చివరి అంశం పౌర స్ఫూ ర్తి అని ప్రొఫెసర్ రెడ్డి పేర్కొన్నారు. గాలిలో నూ, నీటిలోనూ మైక్రో ప్లాస్టిక్స్ ఉన్నాయని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణను రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(జీ) తప్పనిసరిగా పేర్కొన్నప్పటికీ, పౌరులు పర్యావరణాన్ని దెబ్బతీసే ఆచారాలను కొనసాగిస్తూనే ఉన్నారని ఆయన విమర్శించారు. స్థిరమైన ప్రణాళికలు అమలు చేయడానికి ప్రత్యేక రాష్ట్ర పర్యావరణ అభివృద్ధి కమిషన్ ఏర్పా టు చేయాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ వ్యవస్థపై మరింత బలమైన బాధ్యత నిర్ధారణ అవసరమని డిమాండ్ చేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి చెందిన పర్యావరణ శాస్త్రవేత్త శరత్ కుమార్ హైదరాబాద్‌లో కాలుష్యం ఉందని అంగీకరించినప్పటికీ, అది ఢిల్లీ స్థాయికి చేరదని అన్నారు. 'ఏఐక్యూను అర్థం చేసుకోవడంలో చాలాసార్లు గందరగోళం ఏర్పడుతుంది. మనకు 50-100 మంచి స్థాయి, 100-200 సంతృప్తికర స్థాయి. ఢిల్లీ ఏఐక్యూ గణాంకాలు జాతీయ సగటుగా తీసుకోవడం వల్ల అవి తరచూ తప్పుగా అర్థం చేసుకోవాల్సి వస్తుంద'ని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో ఏఐక్యూ ప్రాంతానికి, ప్రాంతానికి చాలా తేడా ఉంటుందని, సనత్‌నగర్, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో స్థానిక పరిస్థితుల ఆధారంగా మారుతుందని చెప్పారు. వాతావరణ పరిస్థితులు కూడా కొన్నిసార్లు కాలుష్యాన్ని తాత్కాలికంగా పెంచుతాయని తెలిపారు. ఐఐటీ కాన్పూర్‌తో కలిసి దాదాపు రూ.1 కోటి వ్యయంతో నిర్వహించిన సోర్స్ అపోర్షన్‌మెంట్ అధ్యయనం ప్రకారం రోడ్డు ధూళి 27--30 శాతం, వాహనాలు మరో 20--30 శాతం, పరిశ్రమలు సుమారు 15 శాతం కాలుష్యానికి కారణమని వెల్లడైంది. ప్రస్తుతం దాదాపు 500 అనుబంధ పరిశ్రమలను కవర్ చేసే కార్యాచరణ ప్రణాళిక అమల్లో ఉందని ఆయన తెలిపారు. ఇందులో ఆకస్మిక తనిఖీలు, వాహనాల పర్యవేక్షణ, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, చార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, మొక్కల నాట్లు, రియల్‌టైమ్ గాలి నాణ్యత పర్యవేక్షణ వంటి చర్యలు ఉన్నాయి. 'మన అవగాహన, చర్యలే కీలకం. ఉల్లంఘనలను అరికట్టడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత అవసరమ'ని శరత్ కుమార్ అన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కే పురుషోత్తం రెడ్డి ఒక కఠిన హెచ్చరిక జారీ చేస్తూ హైదరాబాద్ నిజంగానే ఢిల్లీ దిశగా కదులుతోందని అన్నారు. ఢిల్లీ భౌగోళిక పరిస్థితులు అక్కడి కాలుష్యాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయని ఆయన వివరించారు. హిమాలయాలు, ఉత్తర పర్వత శ్రేణులు గోడలా నిలిచి, గాలిని అడ్డుకుంటాయని, దాంతో ధూళి అక్కడే చిక్కుకుపోతుందని చెప్పారు. అనేక ప్రాంతాల నుంచి వచ్చే ధూళి, థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుకతో కలిసిపోయి, సూక్ష్మ కణాలను పెంచి గాలిని అత్యంత విషపూరితంగా మారుస్తోందని ఆయన అన్నారు. ఢిల్లీ అభివృద్ధిని ప్రణాళిక చేయడంలో పర్యావరణ పరిమితులను పర్యావరణ మంత్రిత్వ శాఖ చాలా ముందే పరిగణనలోకి తీసుకోవాల్సింద'ని ఆయన తెలిపారు. భారత ప్రభుత్వం అప్పుడప్పుడు మాత్రమే జాతీయ పట్టణీకరణ కమిషన్లను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు.

# ఇరాన్‌లో అస్థిర పరిస్థితులు

న్యూఢిల్లీ, :ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నిరసనల కారణంగా ఇప్పటివరకు సుమారు రెండు వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యం లో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లోని భారతీయు లు జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత త్వరగా ఇండియాకు వచ్చేయాలని సూచించింది. శుక్రవారం రాత్రి రెండు కమర్షియల్ విమానాలు భారతీయులతో ఢిల్లీ చేరుకున్నా యి. అయితే.. అవి రెండూ రెగ్యులర్ విమానాలే. భారతీయులను ఇరాన్ నుంచి ఇండియాకు తరలించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన విమానాలు కాదు. ఇక.. భారత ప్రభుత్వం అక్కడి పరిస్థితులను బట్టి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అత్యవసరమైతే తప్ప ఇరాన్‌కు ప్రయాణించవద్దని భారతీయులను హెచ్చరించింది. ఇరాన్ ఎయిర్ స్పేస్ తాత్కాలికంగా మూసివేయ డంతో జనవరి 15 నుంచి రెండు దేశాల మధ్య పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇప్పుడిప్పుడే ఎయిర్ స్పేస్ పరిస్థితులు సాధారణ స్థితిలోకి వస్తున్నాయి. దీంతో భారతీయులు అక్కడి నుంచి ఇండియాకు వచ్చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం తమకు ఎంతో సాయం చేసిందని అంటున్నారు. శుక్రవారం రాత్రి ఇండియాకు చేరుకున్న ఓ ఎంబీబీఎస్ విద్యార్థిని మీడియాతో మాట్లాడుతూ.. 'నేను నిరసనల గురించి విన్నాను. కానీ, నేరుగా చూడలేదు. అక్కడ ఇంటర్‌నెట్ కూడా లేదు' అని చెప్పుకొచ్చారు. మరో వ్యక్తి స్పందిస్తూ.. 'మేము బయటకు వెళ్లినపుడు నిరసనకారులు కారుకు అడ్డంగా వచ్చారు. కొంచెం ఇబ్బంది పెట్టారు. అక్కడ ఇంటర్ నెట్ కూడా లేదు. ఆ కారణంతో ఇండియాలోని మా కుటుంబాలకు విషయం చెప్పలేకపోయాం. ఆఖరికి ఇండియన్ ఎంబసీని కూడా సంప్రదించలేకపోయాం' అని వాపోయారు

# వరుస ఫ్లాప్స్ తర్వాత రామ్ కొత్త ప్రయోగం



టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని వరుస పరాజయాలతో సతమతమవుతున్నప్పటికీ, మళ్లీ బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటాలని గట్టి నిర్ణయంతో ముందుకెళ్తున్నారు. ఇటీవల భారీ అంచనాల మధ్య విడుదలైన 'డబుల్ ఇస్మార్ట్', 'ఆంధ్ర కింగ్' వంటి చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో, తన తదుపరి సినిమాల విషయంలో రామ్ మరింత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటి వరకు చేసిన రొటీన్ మాస్ సినిమాలకు భిన్నంగా, కొత్తదనం ఉన్న కథలను ఎంపిక చేసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావాలని రామ్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ సెన్సేషనల్ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. విశేషమేమిటంటే, ఈ సినిమాను ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ వద్ద శిష్యరికం చేసిన ఓ అసిస్టెంట్ డైరెక్టర్ తెరకెక్కించబోతున్నాడని సమాచారం. లోకేష్ సినిమాలకు ప్రత్యేకమైన ఇంటెన్సిటీ, గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే ఎలా ఉంటాయో తెలిసిందే. అదే స్టైల్‌లో ఈ సినిమా కూడా పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందనుందని టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రం ద్వారా రామ్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించేందుకు దర్శకుడు ప్రయత్నిస్తున్నాడని తెలుస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు మరో పెద్ద ప్లస్ పాయింట్ మ్యూజిక్. ప్రస్తుతం సౌత్ ఇండియాలో టాప్ మ్యూజిక్ డైరెక్టర్‌గా దూసుకుపోతున్న అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారని సమాచారం. అనిరుధ్ అందించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సాంగ్స్ సినిమాకు ప్రత్యేక హైప్ తీసుకురావడం ఖాయం. రామ్ ఎనర్జీకి అనిరుధ్ మ్యూజిక్ జతకలిస్తే థియేటర్లలో మంచి స్పందన రావడం ఖాయం అని అభిమానులు భావిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ రామ్ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలవొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. త్వరలోనే ఈ క్రేజీ కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మొత్తానికి, వరుస ఫ్లాప్స్ తర్వాత రామ్ తీసుకుంటున్న ఈ కొత్త నిర్ణయం ఆయన కెరీర్‌కు ఎంతవరకు మలుపుతిప్పుతుందో చూడాలి. కొత్త దర్శకుడి విజన్, అనిరుధ్ సంగీతం కలిసి రామ్‌కు మళ్లీ సక్సెస్ అందిస్తాయా అన్నది ఆసక్తికరంగా మారింది.

# మరోసారి అంతర్జాతీయ వేదికపై రష్మిక..



'నేషనల్ క్రష్' రష్మిక మందన్న తన క్రేజ్‌ను మరోసారి అంతర్జాతీయ స్థాయిలో చాటుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆదరణ ఉన్న జపనీస్ యానిమేషన్ వేడుక 'క్రంచీరోల్ యానిమే అవార్డ్స్'లో ప్రజెంటర్‌గా వ్యవహరించేందుకు ఆమె ఎంపికయ్యారు. మే 23న జపాన్‌లోని గ్రాండ్ ప్రిన్స్ హోటల్ షిన్ టకనవాలో ఈ 10వ వార్షికోత్సవ వేడుక అట్టహాసంగా జరగనుంది.

రష్మిక ఈ వేదికపై ప్రజెంటర్‌గా కనిపించడం ఇది రెండోసారి కావడం విశేషం. ఈ విషయాన్ని రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. "మళ్లీ జపాన్‌కు.. యానిమే వెనుక ఉన్న అద్భుతమైన వ్యక్తులను సెలబ్రేట్ చేయడానికి వెళున్నా" అంటూ క్యాప్షన్ జోడించారు. 2024లో జరిగిన వేడుకలో తొలిసారి ప్రజెంటర్‌గా పాల్గొని, ఈ ఘనత సాధించిన మొదటి భారతీయ సెలబ్రిటీగా రష్మిక చరిత్ర సృష్టించారు.

ఇప్పుడు రెండోసారి కూడా అదే అవకాశం దక్కించుకోవడం ద్వారా గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ఆమెకున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. ఈసారి వేదికపై ఆమెతో పాటు అసుకా సైతో, డానా పవోలా, విన్‌స్టన్ డ్యూక్ వంటి అంతర్జాతీయ ప్రముఖులు కూడా ప్రజెంటర్లుగా వ్యవహరించనున్నారు.

రష్మికకు యానిమేషన్ ప్రపంచంతో మంచి అనుబంధం ఉంది. 'జుజుట్సు కైసెన్', 'డీమన్ స్లేయర్' వంటివి తన ఫేవరెట్ అని ఆమె పలు సందర్భాల్లో చెప్పారు. ప్రస్తుతం భారతదేశంలో క్రంచీరోల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఆమె బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఇక సినిమాల విషయానికొస్తే, రష్మిక ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి ఆమె నటించిన 'కాక్‌టెయిల్ 2' జూన్ 19న విడుదల కానుంది. చాలా కాలం తర్వాత భర్త విజయ్ దేవరకొండతో కలిసి రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో 'రణబాలి' అనే పీరియడ్ యాక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. వీటితో పాటు గిరిజన నేపథ్యంతో వస్తున్న 'మైసా' అనే యాక్షన్ డ్రామా వంటి భారీ చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి. ఇలా ఒకవైపు ప్రాంతీయ సినిమాల్లో అగ్రతారగా కొనసాగుతూనే, మరోవైపు గ్లోబల్ పాప్ కల్చర్‌లో తనదైన ముద్ర వేస్తూ రష్మిక ముందుకు సాగుతున్నారు.

# 'రామాయణ్'లో రణ్‌బీర్ డబుల్ రోల్



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ త్వరలోనే వెండితెరపై డబుల్ రోల్‌లో సందడి చేయబోతున్నారు. డైరెక్టర్ నితీష్ తివారీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ్'లో రణ్‌బీర్ రెండు విభిన్నమైన పాత్రల్లో కనిపించనున్నట్లు స్వయంగా ఆయనే వెల్లడించారు. ఇటీవలే హనుమాన్ జయంతి సందర్భంగా విడుదలైన 'రామ గ్లింప్స్'పై సోషల్ మీడియాలో భారీ చర్చ నడుస్తోంది. ఈ గ్లింప్స్ విడుదలైన అనంతరం రణ్‌బీర్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఈ సినిమాలో తాను కేవలం శ్రీరాముడి పాత్ర మాత్రమే కాకుండా, విష్ణుమూర్తి మరో అవతారమైన మహర్షి పరశురాముడి పాత్రను కూడా పోషిస్తున్నట్లు క్లారిటీనిచ్చాడు. దీంతో ఈ వార్త విన్న అభిమానులు తెగ సంబరపడిపోతున్నారు. శ్రీరాముడు ఒక అవతారమైతే, ఆయన కంటే ముందు వచ్చిన అవతారం పరశురాముడు. ఈ రెండు దివ్యమైన పాత్రలను ఒకే సినిమాలో చేసే అవకాశం రావడం నా అదృష్టం. ఈ రెండు పాత్రల బాడీ లాంగ్వేజ్, స్వభావాలు వేరు. సినిమా షూటింగ్‌కు ముందు ఒక సంవత్సరం పాటు ఈ రెండు క్యారెక్టర్ల మూలాలను, వాటి వెనకున్న ఆధ్యాత్మికతను అర్థం చేసుకోవడానికి చాలా కష్టపడ్డాను అని రణ్‌బీర్ పేర్కొన్నాడు. నమిత్ మల్హోత్రా దాదాపు రూ. 4000 కోట్ల భారీ బడ్జెట్‌తో రెండు భాగాలుగా నిర్మిస్తున్న ఈ సినిమాలో సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా కన్నడ స్టార్ యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఈ భారీ విజువల్ వండర్ మొదటి భాగం 2026 దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?




మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెర కెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వా రణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యా క్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అం దిస్తున్న ఈ సినిమాలో పృథ్వీ రాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపి ంచబోతు న్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయ టకు వస్తోంది. ప్రస్తుతం హైదరా బాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియ గానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.


## 'ఎల్లమ్మ'లో హీరోగా దేవి శ్రీ ప్రసాద్... దర్శకుడు వేణు ఎల్దండి సంచలన నిర్ణయానికి ఇదే కారణం!






'బలగం' సినిమాతో ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న దర్శకుడు వేణు ఎల్దండి తన తదుపరి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'తో మరోసారి భారీ అంచనాలను సృష్టిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ నడుస్తోంది. ఈ సినిమాలో హీరోగా నాని, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వంటి స్టార్స్ నటిస్తారని గతంలో ప్రచారం జరిగింది. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, దర్శకుడు వేణు ఈ పాత్ర కోసం దేవి శ్రీ ప్రసాద్‌ని ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన దేవి శ్రీ ప్రసాద్... ఈ చిత్రంతో హీరోగా కొత్త ప్రయాణం ప్రారంభించబోతున్నారు. ఇది ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై వస్తున్న సందేహాలకు దర్శకుడు వేణు క్లారిటీ ఇచ్చారు. సినిమాలో తీసుకునే ప్రతి నిర్ణయం కథకు అనుగుణంగానే ఉంటుంది. 'ఎల్లమ్మ' కథకు ఒక ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ ఉన్న వ్యక్తి కావాలి. మొదట వేరే నటులను అనుకున్నా... కథ మారుతూ ఉండటంతో దేవి శ్రీ ప్రసాద్ అయితేనే సరిపోతారని భావించాం అని తెలిపారు. కథలోని సహజత్వం , భావోద్వేగాలను ప్రేక్షకులకు బలంగా చేరవేయడానికి దేవి సరైన ఎంపికగా కనిపించారని ఆయన వివరించారు. బలగంతో గ్రామీణ భావోద్వేగాలను అద్భుతంగా చూపించిన వేణు... 'ఎల్లమ్మ'లో కూడా అదే మట్టి వాసనను తెరపై ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమా కూడా ఎమోషనల్ డ్రామాగా ఉండబోతుందని సమాచారం. సంగీత దర్శకుడిగా ఎనలేని క్రేజ్ సంపాదించిన దేవి శ్రీ ప్రసాద్‌ని నటుడిగా ఎలా చూపిస్తారు? ఆయన పాత్రలో ఎంతవరకు ఒదిగిపోతారు? అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. టాలీవుడ్‌లో కొత్త ప్రయోగాలలు ఎప్పుడు అందరిలో ఆసక్తిని కలిగిస్తుంటాయనే విషయం మనకు తెలిసిందే. ఈ క్రమంలో వేణు -- దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏది ఏమైన , వేణు ఎల్దండి తీసుకున్న ఈ ధైర్యవంతమైన నిర్ణయం ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. 'ఎల్లమ్మ' సినిమా ద్వారా దేవి శ్రీ ప్రసాద్ నటుడిగా కూడా ప్రేక్షకులను మెప్పిస్తారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సినిమాల్లోకి దేవయాని కూతురు.. తెలుగు 'కోర్టు' రీమేక్‌తో ఎంట్రీ!



ఒకప్పటి ప్రముఖ నటి దేవయాని వారసురాలు సినీ రంగ ప్రవేశం చేస్తున్నారు. ఆమె చిన్న కుమార్తె ప్రియాంక రాజ్ కుమారన్ నటిగా తన ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. విశేషమేమిటంటే.. ఆమె తొలి చిత్రం 2024లో తెలుగులో వచ్చిన 'కోర్టు' సినిమాకు తమిళ రీమేక్ కావడం. పోక్సో చట్టంపై అవగాహన కల్పించే సామాజిక సందేశంతో ఈ చిత్రం రూపొందుతోంది. తెలుగు సినిమా 'కోర్టు' ఆధారంగా తమిళంలో 'రంజన్: ది అడ్వకేట్' పేరుతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు త్యాగరాజన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, ఆయన కుమారుడు జీన్స్ ప్రశాంత్ కథానాయకుడిగా నటిస్తున్నారు. తెలుగు మాతృకలో శ్రీదేవి పోషించిన కథానాయిక పాత్రను ప్రియాంక పోషించనుంది.

ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ చిత్రంతోనే నిర్మాత ఎస్. కదిరేశన్ కుమారుడు హరి కూడా నటుడిగా పరిచయం అవుతుండటం గమనార్హం. తెలుగులో హర్ష్ రోషన్ పోషించిన పాత్రను హరి చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన దేవయాని, తన కుమార్తెను చిత్ర పరిశ్రమకు పరిచయం చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. తన కూతురు తప్పకుండా రాణిస్తుందన్న నమ్మకాన్ని ఆమె వెలిబుచ్చారు. ఈ వేడుకకు నటుడు విశాల్, దర్శకుడు వెట్రిమారన్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja Publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215